


హరి సురత విహారి
అన్నమయ్య శృంగార కీర్తనలకు
మున్నుడి & భావకౌముది
రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech




హరి సురతి విహారి

మొదటి ప్రచురణ

ఆగస్టు 2016

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : అమూల్యం

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్దార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

అక్షరాల కూర్పు మరియు ముద్రణ :

సత్యనారాయణ వరప్రసాద్ రావు పసుపులేటి

ఫోన్ : +91-94939 79719



# అంకితము



కం॥ హరి సురత విహారంబున

సిరినిన్ మరి ధరవధూటి జేరును మురియున్

పరిణయము జరుగు నిత్యము

హరితరుణుల పెండ్లి కాన్క అంకిత మిదిగో !!!

# ప్రార్థన

కం॥ శ్రీ హరి సురత విహారము
వోహోయని భక్తవరులు వొప్పుగ మెచ్చున్
ఈహలనేవివరింతును
మా హరివౌ వేంకటేశ మము రక్షించన్

కం॥ 'హరి సురత విహీరీ' యని
వరదుడు మన అన్నమయ్య వనరుహనయనున్
మురిపించు మధుర కీర్తన
వరుసల శృంగారలీల పాడి తరించెన్.

కం॥ గానము జ్ఞానము నిచ్చును
గానము హరిబాట చూపు కడుముదమిచ్చున్
గానము ఘనులను చేయును
గానము మురిపించు కలిమి కాంతారమణున్.

ఆ.వె॥ చెప్పె నన్నమయ్య శృంగార కీర్తనల్
చిలిపి పనుల హరిని, సిరిని గొలిచె
మురియు వివరమిచ్చి ముక్తిని వేడెద
పిలువుమయ్య దరికి వేంకటేశ!

చం॥ సరసిజనాభుడే గురుడు సాధుజనంబుల హృన్నివాసియున్
వరదుడు అన్నమయ్య హరిబాడెను కీర్తన రాశిపేర్చుచున్
సురతవిహారి మాధవుడు చొక్కుచుజీవుల ఆత్మవాసియై
నిరతము కర్మబద్ధులుగ నీల్గగజేయును జన్మసంకెలన్.

మ॥ హరి శృంగారము నన్నమయ్య తెలుపన్ ఆ భావమేవాక్యమై
స్ఫురియించెన్ మది వేంకటేశుని దయాస్ఫూర్తిన్ నిమిత్తంబుగా
కరుణాసాగరుడైన శౌరి గొలుతున్ కాంక్షించుచున్ సత్కృపన్
వరమై నామది భావకౌముది సదా వర్ధిల్లుగా జ్యోతియై.



ఉ॥ దాసుని తప్పులన్నియును దండముతోసరి! లోకనాయకా!
వాసులు వంతులెంచకుము వాసవసన్నుత! పద్మనాభ! ఈ
దాసుని గావుమయ్య! ననుతన్నిన నాకది మన్ననే సుమా!
చేసిన పాపమెంచకుము చింతల బాపుము వేంకటేశ్వరా!

శా॥ శ్రీకాంతావిభు గొల్వనైతిని కదా! చేయారతొల్లింటనే
నే కాలంబుననైన జూచితినిగా హేయంపు సౌఖ్యాలకే
చేకొన్నాడుర దూరినాదు హృదిలో శ్రీవేంకటేశుండహో!!
నాకయ్యెన్ గతి అన్నమయ్య భళిరా!! నా దారి మళ్ళించెబో!

**మత్తకోకిల :**

కామికానిదె మోక్షగామియుకాడు నిక్కము యీ భువిన్
నీమమియ్యది పల్వురీగతి నీరజాక్షుని జేరరా?
కాముడై జీవుండు దేవుని కౌగలించగ నోపునో
ఏ మనందురు? మోక్షమేయది యింకపుట్టడు జీవుడున్

సీ॥ శృంగారమన్నచో కంగారు పడనేల?
మురవైరి మురిపించు ముక్తి పథము
జన్మ కల్గిన గాని సమయదు 'కర్మంబు'
జంటలు కూడక జన్మయేది?
అవతారపురుషులున్ అవనిజేరుటకిదే
మార్గంబు యెంచగా మఱొకటేది?
రమియించు సురతాన రాజీవనేత్రుండుల
జీవులమదిలోన చింతతొలగు.

తే.గీ॥ దిగినగాని నూతుల లోతు తెలియదయ్య
అన్నమార్యుని శృంగారమమృతమయముల
లోతు తెలియక నాబోంట్లు లోగు కడలి
వేంకటేశుడు మెచ్చిన విమలపథము.

# తొలిపలుకులు

సాధారణంగా కొద్దిపాటి చదువువల్ల వచ్చిన పుస్తక పరిచయంవున్న ప్రతివారికి శృంగారం అంటే బూతు అనే భావన వుంటుంది. ఇది ఒక మానసిక జాడ్యం. బూతు అంటే అశ్లీలం. చెప్పకూడని విషయాలు, చెప్పకూడని వారికి, చెప్పకూడని విధంగా చెప్పటం బూతు. చెప్పవలసిన రహస్యాలు, చెప్పవలసిన వారికి, చెప్పవలసిన విధంగా చెప్పటం శృంగారశాస్త్రం.

ఇది సినిమా శృంగారం మాత్రమే తెలిసిన వారికి పెద్దలకు మాత్రమే అని పొరబడటం సర్వసాధారణం. ఆ భావన శ్రీహరి శ్రీలక్ష్మి, పార్వతిపరమేశ్వరుల పట్ల మరీ యెక్కువగా వుండి, వారి శృంగారాన్ని వర్ణించేవారి పట్ల హేయమై, చులకనగా చూచి తిరస్కరించడం జరుగుతుంది.

అన్నమాచార్యుల వారి శృంగారకీర్తనలకూ అదే గతి పట్టిందని నావంటి వారు నమ్మే స్థితికి వచ్చిందంటే అది తెలుగు వారి దురదృష్టం. వజ్రమైనా భూమిలోంచి వెలువడినప్పుడు రాయి అని నాబోటి అజ్ఞానులు భావించడంలో తప్పులేదు కదా! సాక్షాత్తూ T.T.D. వారు 1980లో ముద్రించిన అన్నమయ్య శృంగార సంకీర్తనలు నేటికీ లభ్యం కావడం దీన్నే నిరూపిస్తోంది. మనం ఈ భావజాలం నుండి బయటపడలేము.

శృంగార కీర్తనలు పాడేవారు మాత్రం అది దైవస్తోత్రంగా భావించి, భావాన్ని పట్టించుకోకుండా రాగానికి లయ తాళగతులకు ప్రాధాన్యతనిచ్చి అన్నమయ్య ఆధ్యాత్మకీర్తనల మధ్య ఒకటీ అరా కీర్తనలు వినిపించి 'పని అయింది' అనిపిస్తున్నారు. శృంగారరాయనిపై అన్నమయ్య చెప్పిన వాటి నుండి 1000 శృంగారకీర్తనలు బాగా ఆకళింపుచేసికొని విశ్లేషించాక నాలో ఆ అజ్ఞానం నశించింది.

హరిని మురిపించే శృంగారం, మధురభక్తిని మథించగా జనించే అమృతం. దాన్ని ఆస్వాదించాలంటే స్త్రీ పురుషుల స్థానంలో జీవాత్మ పరమాత్మలను భావించి వారి కలయికే పరమార్థం అని గ్రహించగలగాలి. ఇది చెప్పినంత సులభం కాదు.



భగవత్ కృపవల్ల లభించే రససిద్ధి అది. నా అదృష్టం వల్ల డా॥ పి. ఎల్. ఎన్. ప్రసాద్‌గారి 'తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల్లో రసవృత్తి–వాక్యలయ' అనే గ్రంథం లభించింది. అదివారి పరిశోధనాఫలం. నాబోటి వారికి 'అమృతఫలం'.

మీచేతిలోవున్న ఈ పుస్తకం ఇలా రూపుదిద్దుకోవడానికి ఆ గ్రంథమే మూలకారణం అంటే అతిశయోక్తికాదు. నేను చేసింది అన్నమయ్య శృంగారకీర్తనలను విశ్లేషించడం మాత్రమే. కీర్తనలో నాయికా నాయకులను వారి హావభావాలను విశ్లేషించే అవకాశం లేదు. కీర్తన ఉద్దేశ్యం తెలిపాను కాని అంతకు మించిన వివరణ ఇవ్వడం గ్రంథ విస్తరణ దృష్ట్యా సాధ్యం కాలేదు.

మున్నుడి యెందుకు అవసరం అయిందంటే అన్నమయ్య శృంగార కీర్తనలలో యెవ్వరు కీర్తన పాడుతున్నారు అనే సంశయం వస్తుంటుంది. మధ్యలో వొక్కొక్క సారి అన్నమయ్య దేవితో పాటు తానూ స్వామిని కూడుతాడు. అప్పుడు పాఠకులకి తికమక కలుగుతుంది. ఒక్కొక్కసారి అన్నమయ్య యెంచిన భావమేమిటో అర్థంకాదు. ఒకే మాటను విభిన్న భావాలతో వాడిన సందర్భాలువున్నాయి. ఉదాహరణకు 'గుబ్బతిల్లు' అంటే 'పరితపించు' అనే భావనతో ఒకచోట ప్రయోగిస్తే 'ఉప్పొంగు' అనే భావనతో మరొక చోట ప్రయోగిస్తారు. రవ్వా శ్రీహరిగారి అన్నమయ్య పదకోశం లేకపోతే మనకు ఈ సంగతి తెలియను కూడా తెలియదు. ఎందుకంటే శబ్దరత్నాకరంలో అతిశయించు, ఉప్పొంగు అనే అర్థాలుంటాయి.

ఇక నాబోటి వారేమి చేయాలి? సందర్భాన్ని బట్టి అర్థం చెప్పుకోవాలి. ఇదిట్లా వుండగా అన్నమయ్య వాడిన మాట ఏ నిఘంటువులోనూ కనబడదు. కనబడినా '?' అని వుంటుంది. అప్పుడు నాపని కుడితిలో బడ్డ యెలుక అవుతుంది. నన్ను నమ్మండి. కళ్ళుమూసుకొని స్వామిని స్మరిస్తే ఆ భావం నాకు తడుతుంది. అది కద్దో, కల్లో అని అమ్మవారిలా సంశయించను. కద్దు అనే భావిస్తాను. ఆ జగత్సాక్షే నాకు సాక్షి. కాబట్టి నేనిచ్చిన వివరణే నూటికి నూరుపాళ్ళు సరైనది అనే దుస్సాహసం నేను చేయలేను. నేనే కాదు యెవ్వరూ చేయలేరని నా నమ్మకం.

నా స్ఫురణ స్వామి అనుగ్రహం అని చెప్పటానికి మరొక కారణం వున్నది. నేను ఉదయమున వ్రాసిన భావము ఆ కీర్తన అయిపోగానే పలకమీద వ్రాసింది చెరిగిపోయినట్లు చెరిగిపోతుంది. ఒక్కమాట కూడా గుర్తువుండదు. స్వామి నా Boss. అయన డిక్టేషన్ వ్రాసికొని, టైపు కొట్టించి ఇవ్వడమే నాపని. అందులో యేముందో నాకు తెలియదు. అప్పటికప్పుడు తెలిసినా అది క్షణకాలంలో మాయమవుతుంది. అందుకనే ఉపరతిని వివరించిన అన్నమయ్య శృంగారకీర్తన నామనస్సును నిర్మలదర్పణం లాగానే ఉంచుతున్నది. దానిపై అశ్లీలపు మఱకలు లేనేలేవు. ఇది స్వామివారిపై ఆన.

సరే! ప్రస్తుతానికి వద్దాము. సురతము అంటే సామాన్య అర్థము సంభోగము. కాని సునిశిత దృష్టితో చూస్తే అది చక్కగా రమించుట. అంటే దివ్యానందం పొందుట. సతీపతుల సురతములాగా దానికి కాలపరిమితి వుండదు. అన్నీ ఆ దివ్యానందంలో అనంతమే. అది జీవాత్మ పరమాత్మతో రమించాలనే తపన. అలా శ్రీహరితో రమిస్తూ విహరించే భాగ్యాన్ని కోరుకుంటూ జీవాత్మ మోక్షం పొందాలని తపిస్తున్నది.

కామిగాక మోక్షగామికాడు అన్నాడు అభిరామునితో యోగివేమన. ఏదీ కోఱనివ్యక్తి మోక్షాన్నీ కోరలేదు. ఒక్కసారి ఆలోచించండి. బాలుడికి ఆటబొమ్మల్ని కావాలన్నా, యౌవనంలో ఆడుబొమ్మ కావాలంటాడు. కౌమార్యంలో ధనం కావాలన్నా వృద్ధాప్యంలో శాంతి కావాలంటాడు. చివరికి ముక్కి కావాలంటాడు. వాడు అంతవరకూ పట్టుకొన్న కాంత, కనకం, వాడికి 'లంపటం'గా మారి వదిలించుకోవాలన్నా వదలవు. కాంతవల్ల వచ్చిన సంతానం, కనకం వల్ల వచ్చిన కాంక్ష వాడిని వదలవు.

తొలినాళ్ళలో అంతా మధురంగానే వుంటుంది. కాని, చెఱకుగడ తీపి యెంత సేపు వుంటుంది? ఆఖరికి అంతా పిప్పి మాత్రమే. కాని చెఱకు తీపిని ఆస్వాదిస్తూ ఈశ్వరుని సృష్టి మాధుర్యం తెలిసికొన్నవాడు ఈశ్వరుని స్మరించగలిగినవాడు పిప్పి మిగిలిందని పరితపించడు భగవంతుని లీలకు పరవశిస్తాడు.



మానవుని చేత యెంత వైరాగ్యం చెప్పించినా వాడి మనస్సు వైరాగ్యం మీద నిలబడదు. స్వామి నిలబడనీయడు. శృంగారం మీద నిలబడుతుంది. కాని అది పెడదారి పట్టిస్తూనేవుంటుంది. సాధనతో అసాధ్యం యేదీవుండదు. అభ్యాసం కూసువిద్య అన్నారు పెద్దలు.

మనస్సును శ్రీవేంకటేశ్వరునిపై నిలిపి ఆయనే మన తండ్రి–అలమేలు మంగమ్మ మన తల్లి అని త్రికరణ శుద్ధిగా నమ్మితే 'హరి సురత విహారము' ముక్తిసాధనమే అవుతుంది. హరిపై రక్తి మధురభక్తికి జీవన్ముక్తికి సోపానమవుతుంది. ముక్తి అంటే విడుదల. దేని నుంచి విడుదల? బంధనములనుం విడుదల. ఎవరుచేస్తారు? నీకు నీవే. ఎట్లా చేసుకొంటావు? దైవకృపవల్ల. అదెలా వస్తుంది? భక్తివల్ల. అదెలా వస్తుంది? విరక్తి వల్ల. అదెలా వస్తుంది? దేవునిపై ధ్యాస వల్ల. ఆ ధ్యాస యెలా నిలబడుతుంది? దేవునిపై రక్తివలన నిలబడుతుంది. అసలు రక్తి యెలా కలుగుతుంది? శ్రీహరి శృంగార కీర్తనలు చదివి అర్థం చేసికొనినందువలన. అదెలా సాధ్యం? ప్రస్తుతం ఈ రచన చదువుతూ మీరు చేస్తున్నది అదే కదా!

ఇది రాజుగారి ఏడుగురు కొడుకుల కథలా సాగుతూనే వుంటుంది. శ్రీహరి సురత విహారి చదివితే శ్రీవేంకటేశ్వరుని చిలిపి శృంగారం మాటున ఆయన తనతో రమించాలని తపనజెందే అన్నమయ్య లాంటి జీవాత్మలను తనదేవి అలుకను సైతం లెక్క చేయక వాటికి (జీవాత్మలకు) సురత సౌఖ్యాన్నిస్తూ రమిస్తుంటాడు. ఆ హరి సురత విహారం అప్పుడప్పుడు శ్రీదేవికి చిరాకు కలిగించినా ఆ స్వామి పరమాత్మకు జీవాత్మలన్నీ సమానమే అనే భావం తెలిసిన ఆమెను అనునయిస్తూ నీ స్థానం అనితర సాధ్యమైన నా 'ఉరము' అని దానికి ఋజువుగా హృత్కమలవాసినిగా అనుగ్రహించాడు.

ఇక మన అన్నమయ్య తాను ఒక భావనా సుందరియై, చెలికత్తెయై స్వామివారిని, శ్రీదేవిని వొక్కొక్కప్పుడు అనునయిస్తుంటారు. ఒక్కొక్కప్పుడు మందలించుతారు. ఒక్కొక్కప్పుడు బెదిరిస్తుంటారు. ఒక్కొక్కప్పుడు సందేశాలు

చేరవేస్తుంటారు. ఒక్కొక్కప్పుడు సురతపు కిటుకులు బోధిస్తుంటారు. ఒక్కొక్కప్పుడు స్వామి పొందు అనుభవిస్తుంటారు. ఇది 'కామకేళి' వలె అనిపించే జీవాత్మ పరమాత్మల 'సంగమం'.

దేవిదేవరల ఉపరతిని చెప్పగల నేర్పు దుస్సాహసం, మానవమాత్రులైన వాగ్గేయకారులకు సాధ్యమా? అసాధ్యం. జయదేవుని వలె క్షేత్రయ్య వలె, మరి కొందరు శృంగార కవులువున్నా అన్నమయ్య చూపిన చొరవ, వైవిధ్యం చదువురాని వారిని సైతం మరిపించి మురిపిస్తుంది. సంగీతసాహిత్యాలు వాగ్దేవి కుచగిరులని పెద్దల వాక్యం.

కాని ఈ కంప్యూటరు యుగంలో 'సరస్వతీ నమస్తుభ్యం' అంటే పిల్లలకేకాదు వాళ్ల "సార్ల"కి, "మేడమ్"లకే తెలియటంలేదు. వాళ్ళు 'రింగా రింగా రోజెస్' అంటూ పెరిగి సరస్వతికే కాదు ఆవిడ మామగారైన శ్రీహరికీ దూరం అవుతున్నారు. తీరని కోరికలు తీరాలని తిరుమల గిరులెక్కుతున్నారే కాని హరి శరణు కోరి యెవ్వరూ తిరుమల చేరటం లేదు.

మారండి. హరి శరణాగతి కోరండి. దారులెన్నయినా గమ్యం వొక్కటే. భక్తి, విరక్తి, రక్తి – ఈ మూడు దారుల గమ్యం వొక్కటే. దీక్షవుంటే ఏదారిలో పోయినా హరికి దగ్గరవుతారు.

నావంటి అవిటి వానిచేత 3000 అన్నమయ్య కీర్తనలకు వివరణ "పుట్టిచేత్తో" వ్రాయించి సాక్షాత్తు T.T.D. అన్నమాచార్య ప్రాజెక్టు వారికోసం D.T.P. చేయించి, వారికి సమర్పించగలిగానంటే... "ఇది గాక సౌభాగ్యమిదిగాక తపము మఱి, యిదిగాక వైభవం బికనొకటి కలదే?"



మనిషి పుట్టుక అవటం చేత నేనూ ఆశాబద్ధుడనే. 3200 కీర్తనలను విశ్లేషించాలని ఇంకొక "క్రొత్త ఆశ" పుట్టించాడు ఆ "కొండలరావు" గారు నేను యెప్పటిలాగే ఆయన ఆజ్ఞాబద్ధుడను. అలాగే నిమిత్తమాత్రుడను. నన్ను ప్రోత్సహించి ఆదరించిన తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి D.T.P. చేసిన నా మిత్రులందరికీ ధన్యవాదాలు.

Please visit my Website in Google Network
"www.geetadeeksha.com"

అంతేకాదు "kinige.com" వారి "E-Books" లో నావి "10 పుస్తకాలు (2400 అన్నమయ్య కీర్తనల విశ్లేషణ" మిమ్మల్ని అలరిస్తాయి.

"లోకాస్సమస్తా స్సుఖినోభవంతు"







# హరి గానమే అన్నమయ్య జ్ఞానము

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | కీర్తన విషయము | సంపుటము/ సంఖ్య | పేజీ |
|---|---|---|---|
| 1. | అంతకోపితేనే మమ్ము | 24/84 | 1 |
| 2. | అయ్యోనీకు వగచినదే దోసమా | 20/120 | 2 |
| 3. | అహెూ సురత విహారోయం | 5/78 | 3-4 |
| 4. | ఇంతసేసినవాఁడవు యిదినేరవా | 8/114 | 5 |
| 5. | ఇంతిరో యిట్లనైతే యేమి సేసేనే | 20/63 | 6 |
| 6. | ఇంతి వుపచార పూజ యిందే కలిగి నీకు | 22/116 | 7 |
| 7. | ఇట్టి విందుగంటివా నీ వెక్కడనైనా | 21/529 | 8 |
| 8. | ఇప్పుడు విచ్చేసితి వేమందు నే నిఁక | 20/516 | 9 |
| 9. | ఎంత నా సుద్దులు చెప్పీ నిందరితోను | 23/75 | 10 |
| 10. | ఎందాఁక నీ చల మేమి గట్టుకొంటివి | 20/119 | 11 |
| 11. | ఎవ్వరు నెరఁగరంటా యేల బొంకేరు | 18/47 | 12 |
| 12. | ఏవీ(దీ?) నీయందుఁ జూపు ఇందులో వొక్కటైనా | 23/284 | 13 |
| 13. | ఏమందునే వీని మాయ లెన్నైనాఁ గలవు | 8/142 | 14 |





| | | | |
|---|---|---|---|
| 14. | ఏమని భావింతు నిన్ను నెలతని సంతోసింతు | 8/175 | 15 |
| 15. | ఏలనన్నుఁ బాసితివి యిందాఁగానేడపరాకు | 8/74 | 16 |
| 16. | ఏల వూరకున్నాఁడవో యెఱఁగము నేము నిన్ను | 20/123 | 17 |
| 17. | ఏలినవారికి సెల వేమి సేసినా | 20/529 | 18 |
| 18. | ఓయమ్మ ఇంతయేల వొద్దనరే | 20/62 | 19 |
| 19. | కోపించ నేరుతునా గునిసీఁ దాను | 8/69 | 20 |
| 20. | చిత్తగించ వయ్యా నీ సింగారపు దేవులను | 18/456 | 21 |
| 21. | తానేడో మనసేడో తత్తరము లవి యేడో | 20/121 | 22 |
| 22. | తెలుసుకోవయ్య నీవే దిష్టమిది మోహము | 20/518 | 23 |
| 23. | నాయకుఁడ నీచిత్తము నాభాగ్యము | 20/557 | 24 |
| 24. | నేఁడే నాగవల్లి నేఁడే యిల్లునింపులు | 20/558 | 25 |
| 25. | నీరు వట్టు గొన్నవేళ నేయి మందవునా | 20/7 | 26 |
| 26. | నీ వారమిన్నిటాను నీకంటె నెక్కుడు లేరు | 8/155 | 27 |
| 27. | పాయపు రమణుఁడ నీ పంత మింకన నెట్లనో | 24/148 | 28 |
| 28. | మనసురానిది యాల మానఁగరాదా | 2/122 | 29 |
| 29. | మఱియేఁటి సుద్దులు మమ్మేమడిగేవు నీవు | 8/174 | 30 |
| 30. | వలచినపతి వాఁడే వచ్చినదాన నే నిదె | 20/99 | 31 |

**సంఖ్య : 84 సంపుటము : 24 పుట : 57 రాగం : ముఖారి**

పల్లవి: అంత కోపితేనే మమ్ము నట్టె నగుమీ
చెంత నీవు చెనకిన చెనకక మానము

చ. 1: వొక్కటంటే రెండనక వుండుదురా యెవ్వరైనా
మక్కువ ముందర చూచి మాటాడరా
యెక్కువైన దొరవైతే యేలుదుగాని భూమెల్ల
చక్కని మా వద్ద నుంటే జరయక మానము

చ. 2: మెఱిచిన నుఱుమక మిన్నైన నుండదట
గుఱి నీ చేతలు చూచి కోపము రాదా
నెఱజాణవైతే నీకు నీవే వుండేవు గాని
నెఱయ సరికి బేశౌ నిలువక మానము

చ. 3: ముయికి ముయి వెట్టేది మున్నిటివారి తగవు
నియతి నీవు మెచ్చిన నేను మెచ్చితి
ప్రియుడ శ్రీవేంకటేశ పెంపున గూడితి నన్ను
నయమున గుఱుతులు నాటించక మానము

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో శ్రీదేవి భూదేవి స్వామితో 'అమీతుమీ' తేల్చుకోడానికే సిద్దపడ్డారు. ఎన్నాళ్ళని మౌనంగా భరించము? మేము నిన్ను మానము, జరయక మానము, నిలువక మానము, గుఱుతులు నాటించక మానము, ముయికి ముయి వెట్టేది ఇక తప్పదు అంటున్నారు అర్థం కావాలంటే...?

**భావకౌముది :**

అంతకు ఓపితేనే (ఒప్పందమవుతేనే) మమ్ము (ఇద్దరు దేవేరులను) నగుమీ (నవ్వింపుము). నీవు మా చెంతజేరి చెనకిన (స్పృశిస్తే) మేము కూడా చెనకకవుండేమా?

ఎవ్వరైనా పంతం వస్తే ఒకటంటే రెండు అనక వూరకుందురా? ప్రేమను అవలవుంచి మాట్లాడరా? నీవు గొప్ప దొరవైతే అవుదువుగాక! ఏలుకొందువుగాక! మేమూ చక్కని అందగత్తెలమే. మావద్ద నుంటే జరయక (చేరువకాక) మానము.

మిన్నైనా (ఆకాశమైనా) మెఱిసేటప్పుడు మెఱవక వుంటుందా? నీ చేతల లక్ష్యం చూస్తే కోపం రాకుండా వుంటుందా? నీవు నెరజాణవైతే నీకు నీవే వుండరాదా? ఇప్పుడు మాత్రం నెరయ (పూర్తిగా) సరికి బేశౌ (అవునంటే కాదనటమే). అట్లా నిలబడక మానము.

మున్నిటివారు (పాతకాలం పెళ్లాలు) ముయికి ముయి (ఇచ్చిపుచ్చుకోవటాలు) చేసేవారు. ఇప్పటి నియమం యేమంటే నీవు నన్ను మెచ్చితే నేను నిన్ను మెచ్చుతా. ప్రియా! శ్రీవేంకటేశ్వరా! నన్ను ప్రేమతో గూడితివి. మేము కూడా నీపై రతికేళి గుర్తులు వదలక మానము.



**సంఖ్య : 120 సంపుటము : 20 పుట : 81 రాగం : సామంతం**

పల్లవి: అయ్యో నీకు వగచినదే దోసమా
ఇయ్యెడ నీకు వలచుటిదే దోసమా

చ. 1: వాలాయించి మొక్కేవు వాదులకే నిక్కేవు
ఔలే నీతో నవ్వినదే దోసమా
సోలగిలఁ జూచేవు చొక్కి చొక్కి లాచేవు
యీలాగై నీవద్దనుండే దిదే దోసమా

చ. 2: బొమ్మల జంకించేవు పూఁటవూఁటకు మించేవు
అమ్మరో నీయాలనైన దదే దోసమా
రమ్మనుచు మరపేవు రాజసాలు నెరపేవు
యిమ్ముల నిన్ను నమ్మినదిదే దోసమా

చ. 3: యేకతానకుఁ దీసేవు యేమన్నా నోరుమూసేవు
ఆకుమడిచియిచ్చిన దదే దోసమా
పైకొని శ్రీవేంకటేశ పచ్చిగా నన్నుఁ గూడేవు
యీకడ నీవే నేనై తిదే దోసమా

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక (దేవి) ఒక ముగ్ధ. అయ్యో! నీకోసం విచారించటం నాతప్పా? నిన్ను ప్రేమించటం నా నేరమా? నా కనుబొమ్మలు ముడివేయటం కూడా నేరమా? నీ రతిలో తరించి త్వమేవాహం అయి నీవేనేనైతని. అదీ నా తప్పేన అంటోదా తల్లి.

**భావకౌముది :**

అయ్యో! నీ కోసం విచారించడమే దోసమా (నేరమా)? ఇప్పుడు నీకు వలపునిచ్చుటే నేరమా?

నీవేమో వాలాయిఇంచి (బలవంతంగా) నాకు మొక్కేవు. వాదనలంటే రెచ్చి పోతావు. అవునులే నీతో నవ్వటమే నేను చేసిన తప్పు. సోలగిల (తలవంచి) నన్ను చూచేవు. పరవశించి లాచేవు (పెనగేవు). నువ్వు ఈ విధంగా వున్నా నీ దగ్గరనే పడివుండటం నా దోసమా?

స్వామీ! మాట మాట్లాడితే భ్రుకుటి ముడివేసి బెదరించేవు. పూలుపూటకీ యెక్కువ చేస్తావు. అమ్మయ్యో!! నీ పెళ్ళామవటమే నా నేరమా? దగ్గరకు రమ్మని మరపేవు (మరచిపోతావు). నేను దగ్గరకు వస్తే రాచఠీవి చూపుతావు. నిన్ను నమ్మడమే నా తప్పా?

నన్ను యేకాంతానికి రమ్మంటావు. అదేమిటని నేనేమన్నా అంటే నానోరు మూసేస్తావు. నిన్ను ఆహ్వానించిడమే నేను చేసిన తప్పా? ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను పైకి లాగికొని జంకు లేక కూడితివి. ఆ శృంగార రసఝురిలో నీవేనేనైపోయాను. అదే నా దోసమా ప్రభూ!

**సంఖ్య : 78** **సంపుటము : 5** **పుట : 53** **రాగం : శంకరాభరణం**

పల్లవి: అహెూ సురత విహారోయం
సహజ పరాజయ శంకా నాస్తి

చ. 1: యమునా కూలే సుమలతా గృహే
విమల సైకత వివిధ స్థలే
రమణీ రమణౌ రమత స్తయోః
ప్రమదస్య పరాత్పరం నాస్తి

చ. 2: రజనీ కావా ప్రాతః కింవా
త్యజనం భజనం తత్కింవా
విజయః కోవాపజయః కోవా
భుజ పరిరంభ స్ఫుటం నాస్తి

చ. 3: చీనాంశుక రంజిత మేఖలాని
తానే జఘనం తరతి సతి
మానవికలనే మానినీమణేః
హీనాధికపరిహృతిః నాస్తి

చ. 4: కింవా మిళనం కింవా[2] మిళనం
త్వం వా[2] హంవా తన్నాస్తి
సంవాదో వా సరసః కోవా
కింవా వాచ్యా క్రియా నాస్తి

చ. 5: ఆదిదేవ పీతాంశుక బద్ధా
స్వేద సురభి కాశ్మీర జలం
సాదురూహ్యలజావివశతయా
ఖేదేన వచఃకించిన్నాస్తి

చ. 6: వరకుచాగ్ర సంవ్యానం కరేణ
హరౌ పరం పరిహరతి సతి
సరసలోచననాంచల వివశతయా
తరుణ్యాం చైతన్యం నాస్తి

చ. 7: సురతాంత శ్రమ సుఖం కింవా
వరలజ్జా సావా కావా
పరవశతను సావా కావా
నిరతాం తయో నికృతిం నాస్తి

చ. 8: పరిమళ భరిత ప్రచుర సుశీతం
పరమృదువాయౌ వాతి సతి
తిరు వేంకట గిరి దేవ రాధయో
స్సరసరతి సుఖశ్రాంతిర్నాస్తి



**మున్నుడి :**

అన్నమాచార్యుల వారి సంకీర్తనా స్రవంతి స్వచ్ఛమైన దర్పణం వంటిది. శ్రీవేంకటేశ్వరునితో అద్వైతసిద్ధిని పొందిన పదకవితా పితామహుడు చొప్పించిన శృంగారం నిజానికి అద్వైతతాదాత్మ్యమే. జయదేవుడు, క్షేత్రయ్యల వలె మధుర భక్తితో మాధవుని మురిపించి, కరిగించి ముక్తికాంతను చేపట్టిన అన్నమయ్య ఆధునికులకు అందనంత యెత్తులో వున్న ఆదికవి. దర్పణం మనం ఏ వేషం వేసికొంటే మనని అలాగే చూపిస్తుంది. అన్నమయ్య చెప్పిన ఈ గీర్వాణి కీర్తనలో 'సంబోగ చిత్తులు' రతిక్రీడ చూస్తారు. కాని రాధా మాధవులపై భక్తి కలవారు ఒక జీవాత్మ పరమాత్మలో ఏకత్వం పొందాలనే తపన చూస్తారు. నిజానికి స్త్రీపురుషులు ఏకత్వం సాధించటమే 'సురతి'. కాముకులు యెన్నటికీ ఆ రససిద్ధిని పొందలేరు. ఇక చదవండి.

**భావకౌముది :**

ఆహా!! రాధాకృష్ణులు జరిపిన ఈ శృంగార విహారానికి సహజమైన ఓటమి వలన యెట్టి శంకయునూ లేదు. (ఈ రతి క్రీడలో ఓటమిలేదు. ఇద్దరూ విజేతలే).

యమునా నది ఒడ్డున పూపొదరిండ్లలో, స్వచ్ఛమైన ఇసుక తిన్నెల మీద రాధాకృష్ణులు అనంద పారవశ్యమున రమిస్తున్నారు. వారి ఆనందము కంటే భిన్నమైన ఆనందము, నాస్తి (లేనే లేదు).

రాత్రియని కాని, పగలు అని కాని తేడాలేదు. విడుచుట లేదు, కూడుట లేదు. జయాపజయములు లేనేలేవు. రెండు భుజముల ఒత్తిపిడి కూడా ఆ కౌగిలిలో నాస్తి. అంతా ఏకత్వమే.

రతి బంధాలలో మొలనూలు తెగిపోయింది. అది నడుము నాచ్ఛాదించు వస్త్రముపై మెరయుచున్నది. వాటిని సవరించుకొని గర్వ నివారణ చేసికొనుటలేనేలేదు. (మొలనూలు సవరించే సమయమూ వారికి లేదు).

ఎప్పుడు కూటమి జరుగుతుందో తెలియదు. ఎప్పుడు కూడరో తెలియదు. నువ్వు-నేను అనే భావ విరోధమే లేదు. వారి మాటలలో సంవాదములేదు. సరసం లేదు, క్షమార్పణ లేదు, సంభాషణ లేదు, క్రియా లేదు.

ఆది దేవుని పీతాంబరము రతివేగమున కలిగిన చెమట చిత్తడిలో తడిసిపోయింది. రాధ కుచకుంకుమతో మిళితమై ఆ చెమట పరిమళభరితమైనది. సిగ్గుతోను అలసటతోను రాధకు మాట్లడే స్థితి లేనేలేదు.

రాధ కుచాచ్ఛాదిత పయ్యెదను కృష్ణుడు తన చేతులతో తొలగించుచుండగా ఆ సరసురాలి కనుకొలుకులలో వుప్పొంగిన పారవశ్యము అతిశయించి రాధకు స్పృహ లేనేలేదు.

సంభోగాంతమున కలిగిన శ్రమలోని సుఖం వల్లనా? చక్కటి సిగ్గునుండి జనించిన ఆరాధన వల్లనా? పారవశ్యము నొందిన శరీర వైభవము వల్లనా? ఏమో? ఆ రాధాకృష్ణుల మధ్య వంచన లేనేలేదు.

పిల్లగాలులు సుగంధ పరిమళముతో వీస్తున్నాయి. ఆ రాధాకృష్ణులే ఈనాటి పద్మావతీ శ్రీవేంకటేశ్వరులు. వీరిరువురికీ సురతము నందు సుఖమే కాని శ్రమ లేనేలేదు.

**సంఖ్య : 114 సంపుటము : 8 పుట : 85 రాగం : కన్నడగౌళ**

పల్లవి: ఇంతసేసినవాఁడవు యిదినేరవా
కాంత వున్న భావము కందువ రావయ్యా

చ. 1: చెక్కుల లేఁతచిగురు చేతిలోఁ దామరపువ్వు
వొక్కపరే రెండూనబ్బెనువిదకును
యెక్కడయేసునో మరుఁడు యెవ్వరి మర్మమంటునో
చొక్కముగ నీసతిఁ జూతువు రావయ్యా

చ. 2: ఱెప్పల ముత్యాలవాన ఱేసులనే మీలయాఁత
అప్పుడే రెండూఁ గలిగెనంగనకును
తప్పులెవ్వరివల్లనో దైవికమెట్టున్నదో
చొప్పులీ వనితవల్లఁ జూతువు రావయ్యా

చ. 3: చిత్తములో నీరూపు చింతలు నీమీఁదను
హత్తెను రెండూ నిట్టే అతివకును
కొత్తగా శ్రీవేంకటేశ కూడితివింతక ముందు
జొత్తుల చెమటచెలిఁ జూతువు రావయ్యా

**మున్నుడి :**

శృంగారరాయడు కలిగించిన భావోద్రేకం వల్ల దేవి మదనతాపానికి గురి అయింది. ముత్యాలవంటి కన్నీరు మీనాక్షి స్రవిస్తున్నది. దైవనిర్ణయం యెలావున్నా ముందు ఈమె వేదన భరించ శక్యం కావటంలేదు. ఒక్కసారి ఈ అంగనను జూతువు రావయ్యా! అని వేడుకొంటున్నారు అన్నమయ్య, దేవి చెలికత్తెగా మారి.

**భావకౌముది :**

ఇంత గ్రంధసాంగుడవు, ఇది కూడా యెఱుగవా స్వామీ? ఈ కొంత యెట్టి శృంగార భావములతోనున్నదో ఒక పరిచూతువుగాని, రావయ్యా!

మన్మథుడు యెక్కడ తన పుష్పబాణములతో కొడతాడో యెవ్వరి మర్మముల నంటి చొక్కిస్తాడో (పరవశింపజేస్తాడో) యెరుగము. ఈమె చెక్కిళ్ళు లేత చిగురులు. చేతిలో చక్కటి తామరపువ్వు. ఈ ఉవిదకు ఆ రెండూ ఒక్కమారే అబ్బెనయ్యా!

ప్రభూ! ఈమె కనుఱెప్పలు ముత్యాల బిందువులను వర్షిస్తున్నాయి. మీాల (చేపల) వంటి ఈమె కనులు అతి వేగముగా చలించుచున్నవి. ఈ అంగనకు పైరెండూ ఒకేసారి కలిగినవి. తప్పెవరిది? దేవుని చిత్తమెట్లున్నదో? ఈ వనితకు సమకూడిన అవస్తలను చూతువుగాని రావయ్యా!

ఈ అతివకు హృదయపలకమున నీ రూపము, ఆలోచనలలో నీ చిలిపి చేతలు. ఇట్టే ఈ రెండూ హత్తినవి (ఆక్రమించినవి). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నూతనత్వముతో ఈ దేవిని కూడితివి. ఈమెకు కుమ్మరించిన చెమటల చిత్తడిని ముందుగా జూతువుగాని వొకపరి రావయ్యా!



**సంఖ్య : 63 సంపుటము : 20 పుట : 43 రాగం : భైరవి**

పల్లవి: ఇంతిరో యిట్లనైతే యేమి సేసేనే
మంతనాన పతి వీఁడే మరి యేమనేనే

చ. 1: అప్పుడే నేననినా ఆతఁడిందుకు వచ్చితే
వొప్పనతో మొగమోడి వుండుదునని
తప్పుదేర నాడనుండే దగినట్టేల్లా నాడక
నెప్పున యీాడకుఁ దెస్తే నే నేమనేనే

చ. 2: చేత సన్నసేయ నాచెఱఁ గిట్టే పట్టితే-
నాతల నేఁ బరవశ మందుదునని
పై తరవై ఆడనుండే పంతములు వుచ్చుకోక
యీాతల నన్నాడుమంటే యిఁక నేమనేనే

చ. 3: సెలవి నే నవ్వనా శ్రీవేంకటేశ్వరుఁడు
కలసితేఁ గరఁగుదు కమ్మర నని
తొలుతనే ఆడవైతి దూరకువే యిఁకనేమి
నిలిచితి మిద్దరమూ నిన్ను నేమనేమే

**మున్నుడి :**

ఇటువంటి అన్నమయ్య కీర్తనలతో ఎవరు, ఎవరికి యీ కీర్తన వినిపిస్తున్నారు? అనేదే సమస్య ఇది విభుడు చెప్పిన కీర్తన కాదు. (శ్రీ వేంకటేశుడు కలిసితేఁ గరగనా అనటంవల్ల) ఇది దేవి చెప్పిన కీర్తనకాదు. తొలుతనే ఆడవైతి దూరకువే యిక నేమి అని వున్నది, కాబట్టి దెవి చెప్పిన కీర్తన కాదు. కనుక ఇది అన్నమ్మ దేవితో చెప్పిన కీర్తన. అమ్మయ్య!! ఇక చదవండి, నేటి భాషలో.

**భావకౌముది :**

ఓ ఇంతీ! ఇట్లాగైతే స్వామి యేమిచేయునే? ఆయన నీవు కోరి పెండ్లాడిన మగడు. మరి ఇంకా యేమి అనగలడమ్మా?

ఆయన ఇక్కడికే (దేవి దగ్గరకు) వస్తాడని, వస్తే నేను మొగము ముడుచుకువుంటానని చెప్పాను కదమ్మా! ఆయన పొరబాటున బయటనుండే నన్ను (అన్నమ్మను) చూచి తగినట్లు మాట్లాడక నేర్పుతో దగ్గరకు వస్తే నేనేమన గలనమ్మా?

నేను చేతితో సైగ చేస్తున్నా చూడక నా కొంగు పట్టుకొన్న తరువాత నేను పరవశించాను. ఆయన పై తెరవై చూచుకోక అక్కడ నుండే పంతముతో ఇక్కడ నన్ను నాట్యం చేయమంటే, ఇంకా నేనేమనగలనమ్మా? ఆయన యజమాని నేను దాసిని.

శ్రీవేంకటేశ్వరుడంతటివాడు నన్ను కలిస్తే చిరునవ్వు నవ్వకుండా యెలావుండనమ్మా? నేను కరుగుదునని ముందే చెప్పాను నీకు. నన్నెందుకు తిట్టెదవమ్మా? మే మిరువురమూ (స్వామి, అన్నమ్మ) నీ యెదుటనే నిలిచితిమి. నిన్ను మేమేమనగలమమ్మా?

**సంఖ్య : 116　　సంపుటము : 22　　పుట : 78　　రాగం : దేసాళం**

పల్లవి: ఇంతి వుపచార పూజ యిందే కలిగె నీకు
వంతులఁ జేకొని నీవు వరమియ్యవయ్యా
చ. 1: అంగన నిన్నుఁ జూచుటే ఆవాహనము, ఆకెకు
అంగవించి నీవు మతి హత్తినదే ఆసనము
సంగతి నీపై చింతే సదా ధ్యానము సుమ్మీ
అంగపుఁ జెక్కు చెమట లర్ఘ్య పాద్యాదులు
చ. 2: సరుసఁ గన్నీళ్లే ఆచమనము జలకము
అరవిరి పయ్యదయు అంగవస్త్రము
నిరతి మైకమ్మఁ దావి నీకు నిచ్చిన గంధాలు
పరగిన పులకలే పలు పూజలు
చ. 3: దొమ్మి వూర్పు విరహాగ్ని దూపము దీపము నాయ
సొమ్ములే మై మెఱుఁగులు సోలి వీఁగేవే దండాలు
నమ్మిక శ్రీవేంకటేశ నైవేద్యమాయ మోవి
కమ్మరఁ గాఁగిటి నవ్వే కప్పురపు విడేలు

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో దేవి స్వామితో జరిపిన రతికేళి షోడశోపచార పూజలా వున్నదని తులనాత్మకంగా పోల్చి చెబుతున్నారు. స్వామి వారికి ఆ నూతన షోడశోపచార పూజను స్వీకరించి నీవు ఆమెకు నీ సంభోగమనే వరమియ్యవయ్యా! అని వేడుకొంటున్నారు. కౌగిలించిన దేవి నవ్వు కర్పూరతాంబూల ఉపచారమెలా అయిందో ఊహించండి.

**భావకౌముది :**

ప్రభూ! ఇంతి (శ్రీదేవి) వుపచార పూజ (షోడశోపచార పూజ) నీకు ఇందే (ఈ రతికేళిలోనే) కలిగినది. వంతుల (ఒక్కొక్కటిగా) వాటిని స్వీకరించి ఆమె కిమ్మువరము (అనుగ్రహించు).

ఆమె ప్రేమతో నిన్ను తదేకంగా జూచుటే 'ఆవాహనము'. అంగవించి (చేరువయై) నీవామెను మనస్సులో ప్రతిష్ఠించుకొనుటే 'ఆసనము'. ఆమె సదా నిన్ను స్మరించుటే 'ధ్యానము'. అతిశయించి ఆమె చెక్కిట జేరిన చెమట నీపై కారుటే 'అర్ఘ్యపాద్యములు' వొసగి సత్కరించుట.

నీ సరసన కూర్చుని ఆనంద భాష్పములను రాల్చుటే ఆమె నీకు 'ఆచమనము, జలకముల' నొసగుట. జారిన పయ్యెద అమె నీపై గప్పుటే 'అంగవస్త్రము' నొసగుట. అతిశయించిన ఆమె తనూ గంధమే నీకు 'గంధము' నొసగుట. రేగిన పులకరింతలే నీకు 'విరుల పూజ'.

హెచ్చిన ఉచ్ఛ్వాసనిస్వాసలు నీకు 'దూపము'. ఆమె విరహాగ్ని నీకు 'దీపము' నొసగుట. ఆమె శరీరపు తళతళలే నీకు 'ఆభరణము' లొసగుట. సోలిపోయి నీపాదముల చెంత వ్రాలుటే 'దండము'. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె మధురాధరమే నీకు 'నైవేద్యము'. తరువాత నీ కౌగిటిలో ఆమె నవ్వి చుంబించి తననోటి కర్పూరము నీ నోటికి 'కర్పూర తాంబూలము' గా నొసగినది.



**సంఖ్య : 529　　సంపుటము : 21　　పుట : 353　　రాగం : దేసాళం**

పల్లవి: ఇట్టి విందు గంటివా నీ వెక్కడనైనా
అట్టె ఆకె పొత్తున నీ వారగించవయ్యా
చ. 1: కలికికెమ్మోవి తీపు కమ్మని తేనెల విందు
చలువ చూపులు నీకుఁ జక్కెర విందు
సెలవి లే నవ్వులే చిలుపాల తోడి విందు
అలమేలు మంగ సేసీ నారగించవయ్యా
చ. 2: కాంత గోరిన చెనకులు కారపుఁ గూరల విందు
పంతపు మాటలే ఆవ పచ్చడి విందు
వింత బొమ్మ జంకెనలే వేఁడి పడిదాల విందు
అంత సేసీ నీ దేవి యారగించవయ్యా
చ. 3: ఒట్టడి సమరతి యారడి తరితీపు విందు
గట్టి సిగ్గు పెరుగు మీఁగడల విందు
గుట్టుతో మన్నించితివి కొమ్మను శ్రీవేంకటేశ
అట్టె నీ తనివి దీర నారగించవయ్యా

**మున్నుడి :**

ఇది ఆలమేలుమంగమ్మ స్వామి వారికిచ్చిన కమ్మటి విందుయొక్క వివరము. అన్నమయ్య కాలంనాటి విందు భోజనం ధనికుల, రసికుల ఇండ్లలో ఇలా వుండేదని పాఠకులకు అర్థం అవుతున్నది. అధరామృత స్వాదనతో స్వామివారికి ప్రారంభమైన విందు సమరతి కూటమి వల్ల జనించిన గడ్డపెరుగులాంటి సిగ్గులతో ముగిసింది శృంగారరాయని విందు.

**భావకౌముది :**

స్వామి! నీవు ఇటువంటి విందు యెక్కడన్నా చూశావా? ఆమె పొత్తున కూర్చుని చక్కగా ఆరగించవయ్యా!

ఆ కవికి అరుణాధర తీపి నీకు కమ్మటి తేనేల విందు. ఆమె చల్లని చూపులు నీకు చెక్కెర భక్ష్యాల విందు. ఆమె లేత పెదవులు విచ్చీవిచ్చనట్టి నవ్వు నీకు చిలుపాలు (బాగా మఱగకాచిన పాలతో) చేసిన పాయసం విందు. ఇంతచక్కటి విందు ఆలమేలు మంగమ్మ ఇస్తున్నది, ఆరగించవయ్యా!

చిరుకోపంతో దేవి నీపై గోరితో చేసే గీరులు కారం దట్టించిన కూరల విందు. ఆమె పంతముతో ఆడే మాటలు నీకు ఆవకాయ పచ్చడి విందు. ఆమె తమాషాగా కనుబొమ్మలు కదలించి బెదరిస్తుంటే, అది నీకు వేడివేడి పడిదాల (నేటి కాలంలో బజ్జీలంటున్నాం) విందు. నీ దేవి నీకోసం అన్ని వంటకాలు చేయించిందయ్యా తృప్తిగా ఆరగించు స్వామి.

ఆమె దిట్టతనంతో జరిపే సమరం అతిశయించిన తరితీపుల (సంతోషాల) విందు. చలించని సిగ్గులు నిన్ను రంజింపజేసే మీగడ పెరుగు విందు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ కొమ్మను గుట్టుతో (ఏకాంతమున) మన్నించితివి. అదే విధంగా నీ తనివిదీరా యీ విందు ఆరగించవయ్యా!

**సంఖ్య : 516 సంపుటము : 20 పుట : 345 రాగం : హిందోళ వసంతం**

పల్లవి: ఇప్పుడు విచ్చేసితి వేమందు నే నిఁక
కప్పినమొగమోటముగలదాన నేను

చ. 1: యెదురుచూచితి నీకు నెప్పుడు వత్తువోయంటా
నిదుర గంటికి రాక నిన్న నెల్లాను
వెదకి తెమ్మంటే నిన్ను వెలదుఁలనెల్లాఁ బంపి
వుదుటున నెవ్వతింట నుందువోయంటాను

చ. 2: పేరుకొని పిలిచితి పెద్దవాస(కు?) నను నిన్ను
కూరిమితో నిట్టె పలుకుదువంటాను
వారివీరి నడిగితి వలసినచోట్లను
ఆరగించి పవ్వళించేయట్టి నీఇక్కువలు

చ. 3: దేవరకే మొక్కుకొంటి దిక్కులకుఁ జేయెత్తి
కావించి నిన్నుఁ గన్నులఁగన్నదాఁకాను
శ్రీవేంకటేశ నన్ను జిగిఁ గూడితివి నేఁడు
తావులనే నెలకొంటి దక్కుదునంటాను

**మున్నుడి :**

సాధారణంగా దిట్టతనంతో, జాణతనంతో, వాడిమాటలతో వుండే దేవి ఈ కీర్తనలో బేలవలె, స్వామి అడుగులకు మడుగులొత్తే ఇల్లాలి వలె మారింది. పాపం తన పతిని త్వరగా వచ్చేట్లు చేయమని తెలిసిన 'దేవుళ్ళందరికీ' మొక్కుతున్నది. అన్నమయ్య వంటి ఆంధ్రకవేలేడు విశ్వదాభిరామ వినురవేమ'.

**భావకౌముది :**

దేవా! ఇప్పటికి ఇంటికి వచ్చావు. నేను నిన్నేమనను? నేను కప్పిన (అతిశయించిన) మొగమోటము గల వనితను. నిన్ను తూలనాడగలనా?

నీవెప్పుడు వత్తువోయని యెదురుచూచితిని స్వామీ! నిన్నంతా నా కంటిమీద కునుకు రానేలేదు. వెలదులను (నా చెలికత్తెలను) నిన్ను వెదకితెమ్మని పంపించాను. ఒక్కసారిగా (వుదటున) వెదకితే నీవెవ్వతె యింటవున్నావో తెలుస్తుంది.

అంతకీ నిన్ను పేరు పెట్టి 'పెద్దవాకున' (పెద్ద గొంతుతో) పిలిచితిని. అప్పుడన్నా ప్రేమతో 'ఓ' అంటావనుకొన్నాను. వలసిన చోట్లకు (మనకు కావలసిన వాళ్ళందరి వద్దకు) పోయి చూచాను. ఆ ఇండ్లలో ఆరగించి పడుకోవటం నీకు బాగా అలవాటు కదా! నీ జాడ అక్కడే కదా! తెలిసేది.

నా స్వామిని చూపించమని తెలిసిన దేవుళ్ళందరికీ మొక్కుకొన్నాను. దిక్కులకు చేయెత్తి నిన్ను నాకన్నులకు కన్నదాకా కనిపెట్టివుండమన్నాను. అందువల్లనే నేడు నిన్ను శోభతో కూడ గలిగాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దక్కెదవని నీవెక్కడ నెలకొంటే నేనూ అక్కడే వున్నాను.



**సంఖ్య : 75 సంపుటము : 23 పుట : రాగం : శ్రీరాగం**

పల్లవి: ఎంత నా సుద్దులు చెప్పీ నిందరితోను
కొంతైనా తన పాదపు గోరఁ బోలఁ గలనా

చ. 1: తన మన్ననే నా చక్కఁదనము గల ఫలము
ననిచిన తన పొందే నా భాగ్యము
పెనఁగేటి తన రతి పెంపే నా సంపద
యని చెప్పరే చెలులు యతనితోను

చ. 2: కరుణించి తాఁ జూచుటే కలది నా సింగారము
సరుగఁ దాఁబైకొనుటే సామ్రాజ్యము
పరగఁదా మెచ్చుటే నా పాయపు గరగరిక
గరిమఁ దెలుపరే యీ కతలు విభునికి

చ. 3: కొలువులోఁ దా నవ్వుటే గుట్టు నా పెద్దరికము
కలసే తన కాఁగిలే కాణాచి మేలు
యెలమి శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
చెలఁగి యీ విన్నపము సేయరే తనకు

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి తన చెలికత్తెతో తాను స్వామి పాదపు గోటితో తూగననీ, అయినా తనపై యెంతో కరుణతో తనను మన్నించాడనీ తన సుద్దులు వైనం వివరిస్తున్నది. తన అందానికి, సింగారానికి, పెద్దరికానికి శ్రీవేంకటేశ్వరుని బిగికౌగిలే కాణాచి అని ఖచ్చితంగా చెబుతున్నది దేవి.

**భావకౌముది :**

చెలీ! స్వామి ఇందరితో (అందరితో) నా సుద్దులు యెంత చెప్పీనే? కాని నేను తన పాదపు గోరు మాత్రమైనా పోలగలనటే?

నా చక్కదనానికి గల ఫలమేమిటే? తన మన్ననే కదా! అతిశయించిన తన పొందే నా భాగ్యఫలము. ఇక నా సంపద తన రతి పెనగులాటయే. నేనిట్లా అన్నానని అతనితో చెప్పెదరా యేమి?

నా సింగారమునకు కలది (ఫలితము) తాను నన్ను కరుణతో జూచుటే. నా సామ్రాజ్యమేమిటో తెలుసా? అతి లాఘవముగా నన్ను ఆక్రమించుటే. నా యౌవన శోభకు ఫలితము స్వామి మెచ్చుకోలే. చెలియలారా! మీరు వెళ్ళి, ఇకనైనా ఈ వలపు గరిమ (మహిమ) విభునికి తెలుపరే?

నా పెద్దరికము స్వామికి తెలియనిదా? నిండు సభలో నన్ను జూచి అతను గోప్యముగా నవ్వుటే నా పెద్దరికమును తెలుపుతున్నది. తన గాఢాలింగనమున నన్ను కలయుటే నాకు కాణాచి (నెలవు). శ్రీవేంకటేశుడు నన్ను అన్ని విధములా కూడినాడు. ఇక నా విన్నపము స్వామికి వినిపించండే.

**సంఖ్య : 119 సంపుటము : 20 పుట : 86 రాగం : వేళావళి**

పల్లవి: ఎందాఁకా నీచల మేమి గట్టుకొంటివి
యిందువంకనే దొర విన్నిటా నీ వైతివి

చ. 1: పలుకరాదా కొంత పరాకు మానరాదా
పిలిచి పెదవులెల్లా బెండుపడెను-
సెలవుల నవ్వరాదా చెం(చేఁ?)తల దగ్గరరాదా
నిలువు నివ్వెరగాయ నీకుఁగానే ప్రేమను

చ. 2: చక్కఁగాఁ జూడఁగరాదా చలము మానఁగరాదా
మొక్కి మొక్కి చేతులెల్లా మొన(మోటు?)లాయను
మక్కువతో వినరాదా మన్నన లియ్యఁగరాదా
యిక్కువలు విన్నవించి యెలుఁగెల్లా రాసెను

చ. 3: యింటి కిట్టె రారాదా యిటు నన్నుఁ గూడరాదా
వెంటవెంటఁ దిరిగాడి వేసటాయను
అంటి ముట్టి శ్రీవేంకటాధీశ యేలితివి
నంటున నీతోడిరతి నాభాగ్యమాయను

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృఙగార సంకీర్తనలో దేవి స్వామితో నీవు దొరవి.నిజమే, కాని ఇంత మొండి పట్టుదల నీకెందుకు? నాతో చక్కగా మాట్లాడరాదా? మక్కువతో నా మాటలు వినరాదా? ఇంటికి రారాదా? అని ముక్యాయింపుగా నీతో రతి నా భాగ్యం అంటున్నదాదేవి..

**భావకౌముది :**

స్వామీ! ఇందువంకనే (దీని మూలంగానే) నీవు ఇన్నిటాను (అన్నిటికీ) దొరవైతివి. నీ పట్టుదల యెంత వరకు? ఏమికట్టుకొంటివయ్యా?

కొంత పరాకు మానివేసి నాతో మాట్లాడరాదా? నిన్ను పిలిచి పిలిచి నా పెదవులు యెండిపోయాయి. చిరునవ్వనేదే యెరుగవా? చెంతజేరి చనువుగా వుండరాదా? నిన్ను చూస్తే నిలువునా ఆశ్చర్యం కలుగుతుంది. నీకు ప్రేమ అన్నదే నా మీద పుట్టదా?

స్వామీ! నన్ను చక్కగా చూడరాదా? మొండి పట్టు మానుకోరాదా? నీకు మొక్కీ మొక్కీ నా చేతులు మోటుగా అయిపోయాయి. నా మాట వాత్సల్యంతో వినరాదా? నాకు తగినంత గౌరవం ఇయ్యరాదా? నా సంకేతాలు తెగ విన్నవించి నా గొంతంతా రాచుకుపోయింది.

నా ఇంటికి యిప్పుడే రారాదా? నన్ను కూడరాదా? నీ వెనక వెనకనే తిరిగి తిరిగి అలుపు వచ్చేసింది. ఓ శ్రీవేంకటాధీశా! నన్ను దగ్గరకు తీసికొని యేలితివి. నీకు దగ్గరై రతికేళిలో మురిసిపోవడం నిజంగా నా భాగ్యము ప్రభూ!



**సంఖ్య : 47 సంపుటము : 18 పుట : 319 రాగం : నాగవరాళి**

పల్లవి: ఎవ్వరు నెరఁగరంటా యేల బొంకేరు
నవ్వేరు మిమ్ముఁ జూచి నలినాక్షులెల్లను

చ. 1: చెలియ నుదుటి మీఁది చిన్నారి కస్తూరి బొట్టు
చెలుపు మీరఁగ నీ చెక్కుల నంటె
నిలుపు నామము నీది నెలఁత నుదుట నంటె
తలకొన్న గురుతులు తారుమారులాయను

చ. 2: కాంత కన్నులఁ బెట్టిన కాటుకెల్లా నీ మోవి
వింత బాగులై నేఁడు వెలశున్నది
రంతుల నీ బాహుపురి రమణి సందిటఁ జిక్కె
యింతలోనే మీ చేఁత లివ్వ లవ్వ లాయను

చ. 3: సతి నలమేల్మంగ చరణముల లత్తుక
సొరిది నీ పురమునఁ జూపట్టెను
గరిమ శ్రీవేంకటేశ కౌస్తుభ మింతికి సొమ్మై
దొరసె మీ వలపుల తోడు నీడలాయను

**ముున్నుడి :**

అన్నమాచార్యుల వారి ఈ మధుర కీర్తన మరువలేని అనుభవం. చెలికత్తెలు (నలినాక్షులు) శ్రీవారితో దేవితో పరాచికాలాడుతున్నారు. మీ సంగతి యెవరికి తెలియదు? మీ ఏకాంతసేవ యెలా జరిగిందో తారుమారైన మీ గురుతులే చెబుతున్నాయి. మీరు క్రిందా మీదా పడ్డారని తెలీటం లేదూ? అయినా వినండి.

**భావకౌముది :**

నళినాక్షులైన చెలికత్తెలంతా మిమ్మల్ని చూచి తెగ నవ్వుతున్నారు. మీకేమీ తెలియదని బొంకకండి. మీ గురించి యెవరికి తెలియదు స్వామీ?

మిమ్మల్ని మీరొక్క మారు చూసుకోండి. ఆమె నుదుటనున్న చిన్న కస్తూరి బొట్టు, అందమైన నీ చెక్కిళ్ళపై చేరింది. నీ నిలువు బొట్టు (తిరునామము) దేవి నుదుటి కంటినది. తలకొన్న గురుతులు (మీ ఇరువురికి చెందిన గుర్తులు) తారుమారైనవి స్వామీ!

శ్రీకాంత కన్నుల బెట్టిన కాటుక తమరి పెదవులపై చేరింది. నేడవి వింత సంకేతములై వెలసినవి. సమర్థవంతమైన నీ బాహుపురి (చేతికేయూరములు) దేవి యొక్క సందిట (చేయిదండ) చిక్కువడింది. ఇంతలోనే మీ చేతులు తారుమారై పోయాయే భళీ!

అలమేలు మంగమ్మ పారాణి నీ యెదురు రొమ్ము మీద కొట్టవచ్చినట్లు కనబడుతొంది. అద్భుతాలు చేయగల శ్రీవేంకటేశ్వరా! నీ సొమ్ము కౌస్తుభమణి దేవికి భూషణమైనది. మీ వలపులు తోడు నీడై మాబోటి వారి జన్మలను తరింపజేశాయి తండ్రీ!

**సంఖ్య : 284 సంపుటము : 23 పుట : 117 రాగం : హిందోళం**

పల్లవి: ఏవీ (దీ?) నీ యందుఁ జూపు ఇందులో నొక్కటైన
ఆదిగొని నిన్ను మెచ్చే నప్పుడే నేను

చ. 1: తప్పక వలపులెల్ల తలకెక్కినప్పుడు
కప్పురమే నోటికి కారమై తోఁచు
వుప్పటిల్లు మదనాగ్ని వొడల రేఁగినపుడు
అప్పటి పన్నీరు వుడుకై తోఁచును

చ. 2: కందువైన కాంక్షలు కన్నులఁ దొట్టినప్పుడు
గందమే బాసటయై కమ్ముకొనును
మందలించి తమకము మనసు నిండినప్పుడు
విందుల నమృతమైనా వెగటై తోచును

చ. 3: చిగిరింపుఁ చింత చేయి చెక్కిట మోపినపుడు
మొగిఁ గొప్పువిరులెల్లా మొనలై నిక్కు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
నగిన నగవులెల్లా ననుపులై మించును

**మున్నుడి :**

అన్నమయ్య వినిపించిన ఈ శృంగార కీర్తనలో దేవి స్వామిని సవాలు చేస్తూ ఇలా అంటున్నది. వలపునిండి మనసు పరవశించినవారికి కర్పూరపు పలుకులు కారంగాను, పన్నీరు వేడి నీళ్ళగాను, గంధము విషంలా కమ్ముకొంటుదని, అమృతము కూడా వెగటుగాను, పూలు ముళ్ళలాగాను అనిపిస్తాయట. కాని నిన్ను చూస్తే ఆ మాటలు నిజం కాదనిపిస్తోంది. ఈ సందేహానికి సమాధానం స్వామి సురతమే.

**భావకౌముది :**

స్వామీ! ఇందులో (నేను చెప్పబోయే వలపు గతులలో) ఒక్కటైనా నీయందు వున్నదేమో నాకు జూపించు పూని నిన్ను నేను అప్పుడు మెచ్చుకొంటాను.

వలపులు తలకెక్కిన వారికి నోట్లో వేసికొనిన కర్పూరపు పలుకులు కూడా 'కారం' గా అనిపిస్తాయట. అతిశయించిన మదనతాపం ఒళ్ళంతా మండిస్తుంటే చల్లని పన్నీరు వుడుకై (మండించేదిలా) తోస్తుందట. నిజమేనా?

చెలరేగిన కాంక్షలు (కోరికలు) కన్నులకు తట్టినపుడు గంధము కూడా బాసట (విషము) వలె కమ్ముకొంటుందట. మాట వినని మనస్సు తమకము (పారవశ్యం)తో నిండినప్పుడు విందుగ సమర్పించిన అమృతం కూడా వెగటవుతుందట.

ప్రియురాలికి చింత చిగురించినప్పుడు సున్నితమైన పుష్పములు కూడా మొనలై (వాడి ముళ్ళవలె) గుచ్చుకుంటాయట. నిగిడి (అతిశయించిన) శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను కూడితివి. నీవు నవ్విన నవ్వులన్నీ ననుపులై (ఇంపులై) మించినవి.



**సంఖ్య : 142 సంపుటము : 8 పుట : 84 రాగం : గౌళ**

పల్లవి: ఏమందునే వీని మాయ లెన్నైనాఁ గలవు
కామించి నన్ను నేలె కమ్మటీని చూడరే

చ. 1: కొప్పున రాలీ విరులు గురుతులు చూడరే
చిప్పిలీఁ జెమటలివె చేరిచూడరే
వుప్పతిల్లే పులకలనున్నాఁడు చూడరే
కప్పీఁ బచ్చడము నాకు కమ్మటీనిఁ చూడరే

చ. 2: గందపుఁబేఁట్లు రాలీఁ గమ్మటీనిఁ జూడరే
చిందీ లేఁతనవ్వులు సెలవులఁ జూడరే
అందమైన బుసకొట్లవి గొన్నిజూడరే
అందుకొనీ నా చన్నులంతలోనే చూడరే

చ. 3: వాడుమోవియును వింతవాసనలూఁ జూడరే
వేడుకకాఁడై వచ్చి వేఁడుకొనీఁ జూడరే
వీడెమిచ్చీఁ గోన తిరువెంగళేశుఁడై వచ్చి
కూడెను శ్రీ వెంకటాద్రి కొండమీఁదఁ జూడరే

**మున్నుడి :**

ఇది 'కొన'లో వెలసిన తిరివేంగళనాథునిపై అన్నమయ్య చెప్పిన శృంగార సంకీర్తన. దేవి తన చెలులతో అలసిసొలసి తన ఇంటికి చేరిన శృంగారరాయని వొకసారి తేరిపార చూడమని తన చెలులతో చెబుతున్నది. వివరాలు భావకౌముది తెలుపుతుంది. స్వామిని బాగా చూడండి. 'కమ్మటీని' అంటే మరియొకసారి, బాగా చూడండే అని మొత్తుకొంటున్నదా తల్లి.

**భావకౌముది :**

చెలీ! (అన్నమ్మా!) యేమందునే? అబ్బో! వీని (స్వామి) మాయలు యెన్నెన్నో వున్నాయి. నన్ను విడువలేదు. కామించి నన్నూయేలుకొన్నాడు. మరియొకసారి మీరే చూడండే.

కొప్పునుంచి జారిపడిన పూలు ఇంకా వీని మేనిపై వున్నాయి చూడండి. ఈయన వొళ్ళంతా చిత్తడి అయింది బాగా చూడండి. పులకరింతలతో గుట్టు రట్టయింది చూడండే. నేను చూడకూడదని నాపై వస్త్రము కప్పినాడు, వీని తెగింపు మరి యొకసారి బాగా చూడండే.

స్వామి శరీరంపై నుండి రాలిపడుతున్న గంధపు పెల్లలను వొకసారి మరల చూడండే. ఎట్లా లేత చిరునవ్వులు చిందిస్తున్నాడో చూడండి. అందంగా యెట్లా 'బుస' కొడుతున్నాడో చూడండే. అంతలోనే నాపై వ్యామోహం చూపి నా చన్నులనందు కొంటాడు చూడండే.

వీని అధరము వాడిపోయింది. వింత వాసనకూడ వేస్తున్నాడు. శృంగారరాయుడై వచ్చికూడా నన్నేలా వేడుకొంటున్నాడో చూడండే. ఈ కోనవేంగళరాయడు నాకు ఆహ్వాన తాంబూలం ఇచ్చాడు. కాని వచ్చి నన్ను శ్రీవేంకటాద్రి కొండమీద కూడినదీ వీడే చూడండే.

**సంఖ్య : 175 సంపుటము : 8 పుట : 102 రాగం : సామంతం**

పల్లవి: ఏమని భావింతు నిన్ను నెలతని సంతోసింతు
శ్రీమంతుడ నన్ను దిద్దే చేతొ యిది

చ. 1: కాంతుడ నేనెంతాడినా గక్కదలవు నీవు
యెంత రాతిగుండె వాడవేమి చెప్పేది
శాంతుడవో గట్టువాయి జాణతనమో యిట్టె
మంతు కెక్కించే నా మీది మన్ననో యిది

చ. 2: దిట్టనై నే జిక్కించితే తెమలవేమిటా-నీవు
యెట్టి చలపాదివాడ వేమి చెప్పేది
గుట్టు నీ కెంత గలదో గుణము చండి పడెనో
గట్టిగా నన్నీడేర్చే కరుణో ఇది

చ. 3: బిగ్గ నే గాగిలించితే బెగడ వేమిటా నీవు
యెగ్గు లెంతెంచని వాడ వేమి చెప్పేది
సిగ్గరి తనమో నేడు శ్రీ వేంకటేశ నీ నవ్వో
కగ్గు లేకేలితివి నే కన్న వరమో యిది

**మున్నుడి :**

అన్నమయ్య తను స్వామి వలపుకత్తెగా భావించుకొంటూ చెప్పిన మధుర భక్తి కీర్తన ఇది. నేను ఆవిడను (దేవిని) మాటలన్నట్లు కనిపిస్తుందే కాని నీవు మాత్రం పాషాణ హృదయుడవే. నీ మొండిపట్టు, జాణతనం నీకామెపై గల వలపు నేనెరగనివా? స్వామీ! నీవు నన్ను చూచి నవ్వావు. నాకు అదే గొప్ప వరము అంటున్నారు.

**భావకౌముది :**

ఓ శ్రీమంతుడా! నిన్ను, నెలతను (దేవిని) నేనేమని భావింతును? అయినా నాకు సంతోషమే. ఒకవేళ నీకామెతో చేసే ఈ పనులన్నీ నన్ను సరిగా తీర్చిదిద్దుటకు కాదుగదా!

ఓ కాంతుడా! నేనెంతగా ఆమెను మాటలన్నా నీవు ఆమె కక్క (పాయసము) వదిలి పెట్టవు. నీవెంత రాతి గుండెవాడివో యేమి చెప్పేది? ఇది (నీ ప్రవర్తనకు కారణము) నీ శాంతగుణమా? తెగింపా? జాణతనమా? నన్ను ప్రసిద్ధి కెక్కించే నామీది గౌరవమా?

పోనీ నేను దిట్టతనముతో నిన్ను నిర్భంధిస్తే యెంతకీ బయటపడవు. నీవెంత గడుసువాడివి? ఏమి చేసేది? నీకెంత గోప్యమో చెప్పనలవికాదు. నీగుణములు చూతునా మొండివాడివి. ఒకవేళ ఇది నన్ను ఈడేర్చుటకు నీ ప్రయత్నములా?

నేను నిన్ను బిగియార కౌగలించుకొంటే నీవు యే విధంగాను బిగడవు (జంకవు). ఏమి చేసినా తప్పుపట్టవు. ఇంకేమి చేసేది? ఏమి చెప్పేది? నేడు ఇది నీ సిగ్గరితనమా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇది నీ నవ్వులాటా? నన్ను కగ్గులేక (నిష్కళంకముగా) యేలుకొన్నావు. ఇది నాకిచ్చిన వరమా?



**సంఖ్య : 74 సంపుటము : 8 పుట : 45 రాగం : కొండమలహరి**

పల్లవి: ఏలనన్నుఁ బాసితివి యిందాఁకానేడపరాకు
తాలిమిగలదాననా తలఁచి నీయడకు

చ. 1: మొక్కితిఁగా అల్లనాఁడె మొరఁగులు మానుమని
తక్కులేక వలచినదాన నేనని
నిక్కపుటాసలు నాలో నిండియుండనివియని
మక్కువనాతోఁ గూడి మన్నించుమని

చ. 2: సేవలెల్లాఁ జేసితిగా సిగ్గులు వడకుమని
వేవేలు నావిన్నపాలు వినుమని
భావించునావల్ల నీకు పంతమెల్లాఁజేరెనని
నీవల్లఁ దప్పులేకుండా నెరవేరించుమని

చ. 3: కప్పితిఁగాపయ్యెద యీకపటము వానెనని
చిప్పిలె నా చిత్తము నీచేఁతలనని
యిప్పుడె శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
దప్పిదేరె మోవితేనెఁదనిసితినని

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన కొన్ని శృంగార కీర్తనలు మాలార్థం వొకపట్టాన బోధపడదు. సునిశితంగా అర్థం తెలిసికొని భావమంతా వివరంగా వ్రాసి ఒకటికి రెండుసార్లు మార్పులు చేర్పులు చేసి ఆపైన ఆంతర్యం అవగతం చేసికోవాలి. అదే మున్నుడి అవుతుంది. ఇంతకీ ఇది దేవి స్వామిని బ్రతిమిలాడుకొంటున్న వైనం. ఆనాటి తెలుగు అంత తేలికగా తేలదు.

**భావకౌముది :**

స్వామీ! ఇప్పటిదాకా నన్నెందుకు విడిచిపుచ్చావు? ఎక్కడి పరాకు చిత్తగిస్తున్నావు? తలచినచో నీ అడకు (వంచన) భరించే తాలిమి (ఓర్పు) నాకు వున్నదా? లేదు.

నీ చిరాకులు మానివేయమని ఆనాడే నిన్ను నేను ప్రార్థించాను. నేను నిన్ను నిష్కల్మషంగా ప్రేమించానని చెప్పాను. నాలో నీపై నిజమైన ఆశ నిండివున్నది. నా తప్పులను మన్నించి నాతో మనస్ఫూర్తిగా కూడగా ఆనాడే వేడితిని కదా!

నీ కెన్నో సేవలు చేశాను. అసంఖ్యాకమైన నా విన్నపాలను వినమనీ, బిడియపడవద్దని యెన్నో రకాలుగా ప్రార్థించాను. పోనీ, ఇలా భావించు. నీకీ పట్టుదల నా మూలంగానే అలవడింది. నీవల్ల యెటువంటి తప్పులేదు. అట్లాగే నన్ను నెరవేరించు. నీ ఇష్టం కాదన్నానా?

నీవు కపటబుద్ధి మాని వేసినావని నా పయ్యెదను నీ ముఖముపై కప్పితివి. నా మనస్సు నీ చేతల వల్ల అతిశయించినది. ఓ శ్రీవేంకటేశ్వరా! నాకెంతో సంతృప్తి కలిగినది. నీ అధరామృతముతో నేనెంతో తృప్తి చెందితిని.

**సంఖ్య : 123** **సంపుటము : 20** **పుట : 83** **రాగం : ముఖారి**

పల్లవి: ఏల వురకున్నాఁడవో యెఱఁగము నేము నిన్ను
చాలా నమ్మి శరణంటే సమకూడరాదా

చ. 1: ఱాలు గరిఁగించు నీఱట్టడిపాదము
కాలుచాఁచి సతులఁ గరఁగించు టరుదా
కీలించి మిన్నునేల దొంగిలిన నీచేయి
తాలిమి సతులసుతి దక్కఁగొనలేదా

చ. 2: మాఁకులలోనైనా నుండి మాటలాడేనీ నోరు
కాఁకలమాఁటలఁ జెలి గారవించు టరుదా
మూఁకవనితలసిగ్గు ముంగిట వేసేకన్నులు
ఆఁక నీసతి మోహ మందుకొనలేదా

చ. 3: ముంచి కాంత నురమున మోచుకుండేనీ మేను
ఇంచుకు పరిసురత మిందు కోర్చుటరుదా
యెంచఁగ శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
మంచముపై నుండి మీరు మమ్ము నంపవలదా

**మున్నుడి :**

ఇది అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి మధుర భక్తి కీర్తన. దేవి స్వామి మౌనానికి కారణమేమిటి యని అడుగుతున్నది. నీకు నీ తొలినాటి లీలలు గుర్తుకు వస్తున్నాయా? పోనీ, ఆనాడు చేసినట్లే నేడూ చేయరాదా? అని స్వామితోనే అంటున్నారు. పైగా మీరు మంచమెక్కాక మమ్మల్ని పంపెయ్యరాదా? అని యెత్తి పొడుస్తున్నారు.

**భావకౌముది :**

స్వామి! నీవు మౌనంగా నిలుచున్నావు. ఎందుకా మౌనమో మేమెరగము. చాలా నిన్ను నమ్మి శరణు అంటే నాతో నీవు సమకూడరాదా?

రామావతారంలో రాయిని కరగించింది నీ సాటిలేని పాదము. సిద్ధపడి నావంటి సతులను కరగించటం నీకేం కష్టము? త్రివిక్రముడుగా ఆకాశమూ నేలా బలిచక్రవర్తి నుంచి నీ చేయి 'దొంగిలించింది' మరి ఈ నాడు ధైర్యంతో సతుల మతిని కొల్లగొట్టలేదా?

చెంచులక్ష్మి నీతో మాట్లాడుటకు ఆనాడు నీ నోటితో చెట్లు మాట్టాడేటట్లు చేసిన నరహరివి నీవు. ఉద్రేకం కలిగించే మాటలు యీ చెలి(దేవి) కి చెప్పి గౌరవించలేవా? కృష్ణయ్యవై వనితల సిగ్గులు నీ కన్నుల బయట వేశావు (గోపికా వస్త్రాపహరణ). అక్కడ నీ సతి పద్మావతి మోహాము నందుకోలేవా?

అనాదిగా శ్రీలక్ష్మిని నీవురము మీద మోస్తున్న నువ్వు నేడు ఉపరతిలో నన్ను (అన్నమ్మను) నా బరువు కోర్వలేవా? ఎంచి చూడబోతే వో శ్రీవేంకటేశ్వరా! ఈ యింతిని (అలమేలుమంగను) ఇట్టే కూడితివి. మీరిద్దరూ మంచపైకి చేరాక మకేంపని ఇక్కడ? మమ్మల్ని పొమ్మనరాదా?



**సంఖ్య : 529** **సంపుటము : 20** **పుట : 347** **రాగం : లలిత**

పల్లవి: ఏలినవారికి సెల వేమి సేసినా
నాలి నాచేఁతలెల్లాను నవ్వుసేసుకొమ్మీ

చ. 1: తాలిమిలేనిదాన తమకించి నిన్ను నిట్టె
వేళతోనే రావనుచు వెంగెమాడితి
నీలాగు లెఱఁగక నేరములెల్లా నెన్నితి
వోలవేయ కిఁకనన్నీ నోరుచుకొమ్మీ

చ. 2: చపలచిత్తపుదాన సడిఁబడ్డకోపాన
కపటములెల్లాఁ జూచి కల్లలాడితి
వుపమలనే వంచక వొరసితి జరసితి
నెపములెంచక యిఁక నెయ్యమే నిలుపుమీ

చ. 3: చనవుతోడిదాన సారెసారె నిట్టె
కనుఁగొని కనుఁగొని కలదాడితి
యెనసితి శ్రీవేంకటేశ నేనింతటిలోనె
తనసితనిసి నాతో దయివారుమీ

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక 'కలహాంతరిత'. ఈమెకు ప్రథమ కోపం యెక్కువ. తన తొందరపాటు గ్రహించి పశ్చాత్తాపపడి తన ప్రియునికి మరింత తృప్తినిచ్చి పరవశిస్తుంది. ఇంతకుమించి చెప్పే పాండిత్యం నాకులేదు. నన్ను నమ్మండి.

**భావకౌముది :**

ప్రభూ! నేను తొందరపాటులో ఏలినవారికి యేమి సెలవుసేసినా (యేమి విన్నవించినా) నా అమాయకపు చేతలకు నవ్వుసేసుకొమ్మీ (నవ్వులాటగా తీసికొనుమయ్యా? ).

నేను ఓర్పులేనిదానను. తత్తరపాటులో నీవు వేళకు రాలేదని, వెంగములాడితి (పుల్లగొండి మాటలన్నదీ నిజమే). నీ ప్రేమ తెలియక యేన్నో నేరారోపణలను చేశాను. ఇక వోలవేయక (నిందించక) నా చేతలను కొంచెము వోర్చుకో స్వామి!

నేను చపలచిత్తను. కలుషితమైన కోపంతో నీ మాయలు గ్రహించలేక నేను అబద్ధములాడాను. ఉపమనే వంచక (ఉపాయము నెఱుగక) నిన్ను జరిపిడికి గురిచేసి బెదిరించాను. ప్రభూ! ఇక నా నెపము లెంచక మన స్నేహము నిలుపవయ్యా!

నేను కొంచెం చనువుతీసికొనే చిన్నదానను. నిన్ను పరస్త్రీలతో చూచి చూచీ కలది ఆడితిని (దురుసుగా మాట్లాడాను). శ్రీ వేంకటేశ్వరా! ఇంతలోనే నీతో తృప్తి జెందితిని. ఇక దయవారుమీ (ఓర్పుతో అతిశయింపుము) స్వామి!

**సంఖ్య : 62** **సంపుటము : 20** **పుట : 41** **రాగం :**

పల్లవి: ఓయమ్మ ఇంతయేల వొద్దనరే
నాయముగా దిందరిలో నగుఁబుడు దనకు

చ. 1: చెక్కునొక్కితిని సెలవి నవ్వితిని
మక్కువతో నెఁ(నెం?)తైనా మాటాడడు
మొక్కూ మొక్కితిని మోనాన నుండితిని
యెక్కుడు దిట్టితినంటా నెగ్గువట్టీ నితఁడు

చ. 2: ఇచ్చకముఁ జేసితి ఇచ్చితి విడెమును
కచ్చుపెట్టి యెఁ(యెం?)తైనాఁ గరఁగఁడు
ముచ్చటలాడితిని మోవిఁజూచితిఁ దన్నుఁ
బచ్చిగాఁ జేసితినంటా పగచాటీ నితఁడు

చ. 3: కన్నులాఁ జొక్కితిని కాఁగిటా నించితని
మన్నించె రతి నెఁ(నెం?)తైనా మానఁడు
సన్నల మెచ్చితిని చాయల హెచ్చితిని
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డెంతజాణే ఇతఁడు

**మున్నుడి :**

దేవి తన చెలికత్తె (అన్నమ్మ)కు వినిపిస్తున్న కీర్తన ఇది. స్వామి యెంత బెట్టు చేస్తున్నాడే. తాను చేసే శృంగార చేష్టలు బాగానే వున్నాయి. కానీ నేను తనను తిట్టానంటాడే. ఏమి చేసినా కరగడు. పైగా నేను మోటుదాన్నని పగ చాటుతున్నాడు. ఏం జరిగినా సురతము మానడు. చీకటి పడితే మరీ రెచ్చిపోతాడీ జాణడు. గమనిక: మన తెలుగులో కొంచెం మోటుగావునాన కీర్తనలో మాత్రం... అహో!!.

**భావకౌముది :**

ఓయమ్మా! స్వామి బెట్టుయేల చేయుచున్నాడే? వద్దు అని చెప్పండే. ఇది తనకు అందరిలో నగుబాటు. న్యాయం కూడా కాదు.

నేను ఆయన చెక్కిలిని పుణికితిని. చిరునవ్వు నవ్వితిని. కాని నాతో మక్కువతో నింతైనా మాట్లాడడు. చివరికి కాళ్ళకు మొక్కితిని కూడా. కానీవే అని మౌనంగా కూడా వున్నాను. ఇప్పుడు తనను నేను యెక్కువగా తిట్టానని తప్పుబడుతున్నాడు.

తన కిష్టమైనట్లే ప్రవర్తించాను. తాంబూలము కూడా ఇచ్చాను. కాని ప్రయత్నించి సుంతయైనా కరగడు. తనతో (స్వామితో) ముచ్చటలాడితిని. తన అధరము నాస్వాదించితిని. కాని ఇతగాడు తనతో మోటు సరసమాడినానని నాతో మాటలు మానినాడు. పగ సాధిస్తున్నాడు.

నా కనులారా స్వామిని జూచితిని పరవశించితిని. నా కౌగిట బిగించితిని. ఓ మాత్రమూ వదలక నన్ను రతితో మన్నించినాడు. సాయంత్రంలో మెచ్చుకొన్నాను. చీకటి పడ్డాక రెచ్చిపోయాను. ఏదియెట్లైనా శ్రీవేంకటేశ్వరుడు గొప్ప జాణ అనక తప్పదు.



**సంఖ్య : 69** **సంపుటము : 8** **పుట : 42** **రాగం : భైరవి**

పల్లవి: కోపించ నేరుతునా గునిసీఁ దాను
తీపుమోవికిఁగా నేల తిట్టీనే తాను

చ. 1: పొద్దువోదా వలపులు పోగువోసి వున్నవా
పెద్దరికేలకు నేల పిలిపించీనే
చద్దివేఁడి జవ్వనాన సడి దనమీఁదవేసి
వొద్దనున్న నన్నింతేల వొరసీనే తాను

చ. 2: మాటలేదా మరి తనమనసుకు రూపుగద్దా
చీటికిమాటికి నేల చేఁత చేసీనే
పాటించిన తమకాన పంతమెల్లా తనకిచ్చి
యేటవెట్టుకొంటే యాలయెగ్గరేఁచీఁ దాను

చ. 3: ఇట్టెకొత్తా తనలోని యెన్నికకు తప్పుగద్దా
పట్టి కాఁగిలించి యాల భ్రమయించీనే
గుట్టుతో శ్రీవేంకటేశుఁ గూడి నే సంతోసించఁగా
గట్టియైనందుకు నెంత కరఁచీనే తాను

**మున్నుడి :**

అన్నమాచార్యుల చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో దేవి తన ఆంతరంగిక చెలికత్తె (అన్నమ్మ) తో స్వామి ప్రవర్తనపై కోపం రావటం లేదని తన అధరామృతం కోరితే నన్నెందుకు నిందిస్తాడే అని వాపోతున్నది. తనకు నేనేమైనా కొత్తా? ఎంతగట్టిగా వుందామనుకొన్నా నన్ను క్షణంలో కరగించివేస్తాడు.

**భావకౌముది :**

చెలీ! స్వామిపై కోపించ నేర్చుకొందునా? అప్పుడు ఆయన సణుగుతాడు. అయినా తాను నా పెదవి తీయగాలేదని యెందులకు తిట్టునే?

అతనికేమీ పొద్దుపోదా? ఇక్కడయేమైనా వలపులు కుప్పలు పోసివుంచామా? నన్నెందుకు మధ్యవర్తిత్వానికి పిలిపించేనే? రేయింబవళ్ళు నిందయౌవనము మీద వేసి తన వద్దవున్న నన్నెందుకు ఘర్షణకు గురిచేస్తాడే?

అనవసరమైన మాటలెందుకే? తన మనస్సుకు ఒక రూపం వుంటుందా? చీటికీ మాటికీ యెందుకు చేయి చేసికొండాడే? పాటించి (ఆదరణ చూపి) తన్మయత్వంతో పంతములన్నీ వదలి, భారమంతా తనపై వేస్తే ఇంకా నన్నెందుకు తప్పులెంచి వేధిస్తాడే?

ఇవన్నీ తనకు కొత్తా? తాను చేసిన యెన్నికలో లోపం వుంటుందా? ఇంకా నన్ను పట్టి కౌగిలించుకొని భ్రమలెందుకు కలిగిస్తాడే? రహస్యంగా శ్రీవేంకటేశ్వరుని కూడి నేను సంతోషిస్తుంటే, గట్టిపడ్డందుకు నన్ను తాను అతిసులభంగా కరిగించివేస్తాడే. ఇక వాని నేమిచేయగలనే?

**సంఖ్య : 456 సంపుటము : 18 పుట : 305 రాగం : భైరవి**

పల్లవి: చిత్తగించ వయ్యా నీ సింగారపు దేవులను
హత్తి కరుణించ రాదా ఆస పడీని

చ. 1: నిండారాఁ దనమీఁద నీవు బత్తి గలవని
యండ నున్న చెలి తోడ నాన తిచ్చీని
పండఁ బడి నీ వుండిన పర పిది తనదని
వెండియును తన పెనువేలఁ జూపీని

చ. 2: చనవున నిద్దరికి సమద్రిష్టాయని
తనపొరుగాపె తోడ తలపోసీని
ననిచిన యట్టి ప్రాణనాథుడవు నీవని
వొనర జే కానికలు వొడబెట్టి పంపీని

చ. 3: బెట్టి నీ నోరను తన పేరు నుడిగేవని
చుట్టపు వనిత తోఁ బొంచు లాలించీని
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి మగువను
గుట్టు తోడఁ దనకు నిన్నే గురిసేసీని

**ముున్నుడి :**

తన భర్త ప్రేమగా తనతో జరిపిన శృంగారాన్ని స్త్రీలు తమ ఆప్తమిత్రురాండ్రకు చెప్పుకొని మురిసిపోతుంటారు. ఏకశయ్యా గతులవటం, పేరుబెట్టి పిలవటం, సమదృష్టితో గౌరవించడం అతివలకు అతిశయకారణమే. దేవి చెలియ అయిన అన్నమ్మ స్వామితో చిత్తగించమని వివరించి ఆశపడుతున్న అమెను కరుణించమంటున్నారు.

**భావకౌముది :**

ప్రభూ! శృంగారమూర్తి అయిన నీ దేవేరిని వొకపరి పరికించవయ్యా! ఆమె నీపై ఆశపడుచున్నది. ఆమెను హత్తి (బిగి కౌగిలించి) కరుణించరాదా?

ఆమె నీ చెలికత్తెతో సగర్వంగా యేమి చెప్పిందో తెలియునా? మనస్ఫూర్తిగా నీవు తనను (దేవిని) బత్తిసేసితివి (శ్రద్ధగా గౌరవించావని) చెప్పింది. నీవు నిద్రించిన పఱపును చూపించి అది తనదైనదని తన బొటన వ్రేలుపైకెత్తి విజయ సంకేతముగా చూపినది.

తన పొరుగున వున్న నెచ్చెలితో చనవుగా మీ యిరువురి దృక్పథములు వొకటేనని చెప్పిందయ్యా నీ దేవేరి. నీవు తనను మన్నించిన ప్రాణనాథుడవని చెప్పి ఆమెకు అంతులేని కానుకల నిచ్చి పంపించింది. ఎంత మైమరచిందో నీవే చూడు.

స్వామీ! స్వయంగా నీనోటితో నీవు తనను పేరుబెట్టి పిలిచావని తన చుట్టపు వనితలతో ముచ్చట్లు చెప్పింది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆ మగువను అవలీలగా యేలితివి. రహస్యంగానే నీ దేవి తనపై నీకున్న గురిని వివరించిందయ్యా!



**సంఖ్య : 121 సంపుటము : 20 పుట : 8 రాగం : సామంతం**

పల్లవి: తానేడో మనసేడో తత్తరము లవి యేడో
పానిపట్టి ఇటువంటిభ్రమ యింత గలదా

చ. 1: సుదతి విభునిమోము చూచె పరాకున
అదనఁ గప్రపుధర అద్దమంటాఁ జూచీనే
పదకము నడుమఁ బైపైఁ బెట్టి మొల్లమూలు
కదిసి హారమంటాఁ గట్టుకొనేఁ జూడవే

చ. 2: యేఁటవెట్టి పతితోడ మాటలాడి వేగిరాన
గాఁటపుటందెలు తనకరములఁ బపెట్టీనే
పాటియైనవుంగరాలు పాదపువేళ్ళఁ బెట్టి
యీటుగా మట్టెలు వేళ్ళ నిదియేల పెట్టీనే

చ. 3: కామిని శ్రీవేంకటేశుఁ గదిసేటివేడుకను
వేమరు మాణిక్యములు విడెమంటా నిచ్చీనే
ఆమనిరతిఁ దనిసి అఱతలో నన్నీఁదెలిసి
సామజగమన ఇన్నీఁ జక్కఁ జేసుకొనెనే

**ముున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార సంకీర్తనలో శ్రీవేంకటేశుని చేరు తత్తరపాటులో దేవి అవస్థను వర్ణిస్తున్నారు. చేతివ్రేళ్ళ వుంగరాలు కాలివ్రేళ్ళకు మట్టెలను చేతివేళ్ళకు పెట్టినదంటే ఆమె కంగారును గ్రహించండి. మరి దీనికి తరుణోపాయం ఆమని రతియే నంటున్నారు. ఔరా! అన్నమాచార్యా!

**భావకౌముది :**

ఈ దేవికి తానేడవున్నదో తన మనస్సెక్కడవున్నదో అన్నట్లైనది. పానిపట్టి (పూనుకొని) ఇటువంటి మతి భ్రమలు తనకింకా యెన్నివున్నాయో?

ఆ సుదతి అద్దంలో తనమగని వదనము చూచు పరాకున (పరవశత్వమున) తన కర్పూర భరిణ మూతనే అద్దమనుకొని జూచినది. మెడలో దాల్చవలసిన పతకమును మొలనూలు స్థానములో ధరించి, మొలనూలును కంఠహారంగా ధరించింది. ఏమా తత్తరము (తత్తరపాటు).

ప్రయత్నించి పతితో మాటలాడవలెననే తొందరలో తన కాలి అందియలను కరములపై ధరించినది. అట్లాగే చేతివ్రేళ్ళకు పెట్టవలసిన ఉంగరాలను కాలివ్రేళ్ళకు ధరించి, మట్టెలను చేతి వేళ్ళకు పెట్టినది. ఇట్లేల చేయుచున్నది?

ఆ కామిని శ్రీవేంకటేశుని కూడు వేడుకలో పొరబడి మాణిక్యములనే తాంబూలమునకు మారుగా నిచ్చినది. కాని వసంత కాలపు రతితో తృప్తి జెంది అంతలో తన భ్రమను గుర్తించి ఆ కరిగమన అన్నిటినీ చక్కబెట్టుకొనినది.

**సంఖ్య : 518 సంపుటము : 20 పుట : 346 రాగం : బౌళి**

పల్లవి: తెలుసుకోవయ్య నీవే దిష్టమిది మోహము
కలకాలమును నీపైఁ గలది నామోహము

చ. 1: ఆయములు గరఁగేటి అదివో మోహము
చాయలకు లోనైనదే సరిమోహము
పోయినానుఁ బోనీకపొదిగినది మోహము
యీ(యే?)యెడ నెగ్గులుసిగ్గు లెంచనిదె మోహము

చ. 2: మంతనము యేపొద్దు మరిగినది మోహము
దొంతిపులకల తొప్పఁదోగే(ది?) మోహము
వింతలేనినవ్వుల వేడుకలే మోహము
బంతిరతుల నేపొద్దుఁబరగుటే మోహము

చ. 3: కన్నులఁగనినప్పుడు కాగిలించుటే మోహము
వన్నెలకు మాటగడవని(ది?) మోహము
ఇన్నిటాను శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వున్నతి నలుగ కిట్టె వుండుటే మోహము

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి తన స్వామితో నిజమైన మోహమని దేనినంటారో వివరిస్తున్నది. నీపై కలకాలం నాకుండే దాన్నే మోహమంటారు. వన్నెచిన్నెలకు లొంగనిదే నిజమైన మోహము. 'ఉన్నతిన్ అలుగక ఇట్టే ఉండుటే మోహము' అనే మాటలో చెప్పలేని భావాలు మరెనో?.

**భావకౌముది :**

స్వామీ! ఇది నీవే తెలుసుకోవయ్యా! మోహము అదృష్టజనితము. నా మోహము క్షణికమైనది కాదు. అది నీపై కలకాలం వుండేది.

అంగములు కరిగిపోయేట్లు చేయగలిగినదే మోహము. సరియైన మోహమంటే రాత్రులందు లోబడునట్లు చేయగలిగినదే. పోతానంటే పోనీక కమ్ముకొనునట్లు చేయగలిగినదే మోహము. ఎన్నడేని తమ ప్రియునిలో సిగ్గెగ్గులు యెంచనిదే మోహము.

ఏ వేళనైనా ప్రియునితో మంతనములాడునట్లు చేసేదే మోహము. దొంతరలైన పులకలలో ముంచివేసేదే మోహము. సుపరిచతమైన దరహాసముల వేడుకలే మోహము. ఏ వేళనైనా వరుస రతులలో అతిశయించునదే మోహము.

తన ప్రియుడు కనులబడగానే కౌగలించుటయే మోహము. వన్నెలకు లొంగక ప్రియుని మాట జవదాటనిదే నిజమైన మోహము. ఓ శ్రీవేంకటేశ్వరా! అన్ని విధములా నన్ను గూడితివి. అంతెందుకు మోహమంటే ఔనత్యముతో యెన్నడూ అలుగక నుండుటయే.



**సంఖ్య : 557 సంపుటము : 20 పుట : 352 రాగం : తెలుగు కాంబోది**

పల్లవి: నాయకుఁడ నీచిత్తము నాభాగ్యము
పాయపుఁజక్కఁదనాన పాయకుందుఁగాక

చ. 1: వీనులఁ బొంచుకుండితి వేడుకనీమాటలకు
అనుకొని సరసము లాడవైతివి
నేనా నిన్నుఁ గొసరి నెప్పునకుఁ దెచ్చేదాన
మోనముతోఁ జేతులెత్తి మొక్కఁగలఁగాక

చ. 2: కన్నులఁ గాచుకుండితి కదిసి నీమాటలకు
నిన్ననే రావైతివి నీయంతను
నన్నువంటిదా నిన్ను నయానకుఁ దీసేది
పన్ననినీపాదుకలు పట్టఁగలఁగాక

చ. 3: చేతులు చాఁచుకుండితి శ్రీవేంకటేశ్వర నీకు
యీతల నన్నుఁ గూడితి విందుకుఁగానే
ఘాతల మాతరమా కరఁగించ నీమనసు
నీతితో నాతమకము నించఁగలఁగాక

**మున్నుడి :**

స్వామిపై అంకిత భావమున్న నాయిక అతి మనోహరంగా తన స్వామికి నివేదించుకొంటున్నది. నా యౌవనం నీది. నా సర్వాంగాలు నీ కోసం నిరీక్షిస్తూ వున్నాయి. చేతులు చాచి నీకోసం వేచివున్నాను. నీ మనస్సు కరిగించటం నా వలన అవుతుందా? నీ కోసం తన్మయత్వంతో వేచివుంటాను. అన్నమయ్య సాటివారు లేరు.

**భావకౌముది :**

ఓ నాయకుడా! నీ దయ నా ప్రాప్తము. ప్రాయము వలన చక్కదనముతో యెన్నడూ నన్ను విడవాడుకుందువుగాక!

నీ వేడుక మాటలు వినుటకు చెవులు రిక్కించి వేచియుంటిని. నీవు నా సరసన జేరి సరసములాడ వైతివి. నిన్ను కసరుకొని నేర్పుతో నా దారికి తెచ్చుకోగల దాననా నేను? నేను చేయగలిగిందల్లా మౌనంగా నీకు చేతులెత్తి నమస్కరించుటొక్కటే.

సమీపించే నీ మాటలకోసం నా కన్నులు కూడ కాచుకొనివున్నవి. నిన్ననే నీవురావైతివి. నీయంత వానిని నావంటిది నయానకు (అనునయించుటకు) సాహసించ గలదా? నీ పాదుకలను పట్టుకొని బ్రతిమిలాడగలను.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ కొరకు నాచేతులు చాచుకొని వుండిపోయాను. ఇందుకుగాను (అందుకే) నీవు ఇక్కడ నన్ను కూడితివి. నీ కఠినమైన మనస్సును తెగించి కరగించటం మా తరమౌతుందా? నేను చేయగలిగిందల్లా అంకిత బావముతో నా తన్మయత్వము పరిపూర్ణత చెందించగలను. అంతే.

**సంఖ్య : 558  సంపుటము : 20  పుట : 373  రాగం : రామక్రియ**

పల్లవి: నేఁడే నాగవల్లి నేఁడే యిల్లునింపులు
పోఁడిమి గోవిందపతి భోగించీ నిదివో

చ. 1: అల్లదే దేవునిరథ మల్లదే గరుడధ్వజ-
మెల్లలోకములు గెల్చి యేఁగీనదే
యిల్లిదే లక్ష్మిభూము లిద్దరుదేవుళ్లు వీరె
చల్లేరు శాసలుఁ దాము సరికి బేసికిని

చ. 2: సేనాపతి యల్లవాఁడే చేరి దేవతలు వారే
శ్రీనారాయణుఁడు చెలఁగీనదే
ఆనుక యడుగడుగు కారగించీ వీధులను
వానలుగా నందరికి వరములొసఁగుచు

చ. 3: దేవదుందుభులు మ్రోసె దిక్కులెల్లాఁ జల్లనాయ
శ్రీవేంకటేశుఁ డితఁడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రదుకుఁడు
వేవేలు శోభనముల వేడుకకాఁ డితఁడు

**మున్నుడి :**

తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని కళ్యాణంలో నాగవెల్లి నూతన గృహప్రవేశం జరిగాయి. గోవిందపతి భోగము వర్ణనాతీతము. కాని అన్నమయ్య మన కళ్ళకు కట్టినట్లుగా కీర్తన నాలాపిస్తున్నారు. విని తరించండి. మీరు మాత్రం చదివి, భావించి ఆనందించండి.

**భావకౌముది :**

ఈ శ్రీవేంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవమున నేడు నాగవల్లి (నాకబలి) మరియు ఇల్లునింపు (గృహప్రవేశము). ఈ గోవిందపతి పోడిమితో (ఒప్పుగా) ఇదే భోగించుచున్నాడు.

అల్లదిగో దేవుని రథము. అదిగో గరుడధ్వజము. లోకములన్నింటిని గెలిచి అదే పోవుచున్నాడు. ఇదిగిదిగో ఆయన భార్యలైన శ్రీ, భూ కాంతలు. వీరే ఆయన దేవేరులు. తామిద్దరూ సరికిబేసికి (పోటాపోటిగా) స్వామిపై తలంబ్రాలు చల్లుచున్నారు. మనం ధన్యులం.

అదిగో స్వామి సేనాధిపతి విష్వక్సేనుడు. ఆయన వెనక జేరిన ముక్కోటి దేవతలదిగో. ఈ విధంగా శ్రీనారాయణుడు అతిశయించుచున్నాడు. వివాహానంతరం ఆగిన చోటల్లా స్వామికి ఆరగింపులు, వీధి వీధిలో జరుగుచున్నవి. అందరికీ వానపడట్లు వరాలిస్తున్నాడు స్వామి.

అదిగో దేవదుందుభులు మ్రోగుతున్నాయి. దిక్కులన్నీ చల్లబడ్డాయి. ఇతడే శ్రీవేంకటేశ్వరుడస్తు. అందరినీ చిత్తగిస్తాడు, సేవించండయ్యా! ఓ జీవులారా! స్వామిని భావించి బ్రతుకుడయ్యా! అసంఖ్యాకమైన శోబనముల శృంగారరాయడిదిగో వీడే.



**సంఖ్య : 7  సంపుటము : 20  పుట : 5  రాగం : సామంతం**

పల్లవి: నీరు వట్టు గొన్నవేళ నేయి మందవునా
కూరిమి మమ్మిద్దరినిఁ గూరుచరే చెలులు

చ. 1: నెఁలత చెక్కులే నాకు నిలువుటద్దములు
అలరుల తావి వూర్పు లాల వట్టాలు
సెలవుల నగవులే చేతికిచ్చే కప్పురాలు
చలి మందు లిఁక నన్నీఁ జాలునే నాకు

చ. 2: వనిత మాటలే నాకు వలరాచ మంత్రాలు
నినుపుఁ జెమటలే పన్నీటి సోనలు
ఘనమైన సరసాలే గంధపుఁ కస్తూరి పూత
యెనలేని వుపచారా లివియేలే నాకు

చ. 3: సతి తోటి పానుపే చంద్రకాంతపు వేది
యితవుగఁ గూడించితి రిందరూ మమ్ము
రతుల శ్రీవేంకటాద్రి రాయడ నేనిదివో
మితి మీర సూఁచకురే మేలాయఁ బసులు

**మున్నుడి :**

రోగం వొకటైతే మందు మరొకటిస్తే ప్రయోజనమేమిటి? వంటికి నీరు పట్టిన వాడికి నేయి మందుగా ఇస్తే రోగం తగ్గుతుందా? ఇప్పుడు నా ఈ తాపానికి మందు నా దేవి పొందు ముందు నాకా పసందైన విందు నందించండి అంటున్నారు గోవిందుడు. అన్నమయ్య శ్రీవారి విరహవేదన యెంత బాగా వివరిస్తున్నారో విని పులకించండి.

**భావకౌముది :**

చెలులారా! శరీరానికి నీరు పట్టిందంటే, మందుగా నేయి త్రాగిస్తే ప్రయోజనమేమిటి? మమ్మిద్దరిని (స్వామిని మరియు దేవిని) ప్రేమతో వొకటిగా కూరిచి మేలు చేయండి.

నాకు చలిమందులు (శీతలోపచారాలు) వలన ప్రయోజనం యేమిటి? నెలత చెక్కిళ్ళే నిలువుటద్దాలు. ఆమె తలలో పూలు నాకు తావి (సుగంధ ద్రవ్యం). ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసములే వస్త్రవింజామరులు. ఆమె పెదవుల చిరునవ్వే చేతికిచ్చిన కర్పూరపు పలుకులు.

ఆ వనిత (దేవి) మాటలే నాకు మదన మంత్రాలు. అతిశయించిన ఆమె చెమటలే పన్నీటి జల్లులు. అతిశయించిన సరసాలు యేమిటో తెలుసా? ఆమె పూసే గంధము మరియు కస్తూరి పూతలు. చెలీ! నాకు సాటిలేని వుపచారాలు ఇవే.

చెలియలారా! నాకా సతితో చేరిన పానుపే చక్కటి చంద్రకాంత శిలల వేదిక. మమ్మిరువురను మీరు హితకరముగా గూడించితిరి. నేను సురత విహారినైన శ్రీవేంకటాద్రి రాయడను. ఇదిగో మితిమీరునట్లు, నా వుయ్యాల మంచము నూపకండి. నా పని చక్కబడినది.

**సంఖ్య : 155** **సంపుటము : 8** **పుట : 91** **రాగం : మేఁచబౌళి**

పల్లవి: నీ వారమిన్నిటాను నీకంటె నెక్కుడు లేరు
సేవలు సేసేము నీవు చిత్తగించవయ్యా

చ. 1: సేసినచేఁతలు నీవే చెల్లఁబెట్టుదువు గాక
యీసరి మానేరుపులు యేమున్నవి
నేసవెట్టి రాజు వలచినదే దేవులందురు
రాసికెక్క నీసొమ్ము రక్షించుకోవయ్యా

చ. 2: పట్టిన నీపంతమే బలువు సేతువు గాక
యెట్టైన మాగుణములు యేమి చూచేవు
అట్టె పరుసమంటినదేనదియే బంగారందురు
పెట్టని చోట్లఁ బెట్టి పెద్ద సెయ్యవయ్యా

చ. 3: కూడిన నీకూటములే గురులు సేతువు గాక
యీడనే మాయాసోదాలేమున్నవి
యేడను శ్రీవేంకటేశ యేలితేనే బంటందురు
పాడేటివారము నిన్ను బత్తి చేకోవయ్యా

**మున్నుడి :**

అన్నమయ్య శృంగార కీర్తనల 'రాసి'లో చటుక్కున దొరికిన వజ్రం ఈ కీర్తన. పరమాత్ముని అద్భుత శరణాగతి. తనవాదనను సోదాహరణంగా సమర్థించుకోవడం అయనకు వెన్నతో బెట్టిన విద్య. మేమేదో పెద్ద పద కవితా పితామహులం అయిపోలేదు. నిన్ను కీర్తంచినందువల్ల మాకీ ఘనత దక్కింది. అంతే అంటున్నారు.

**భావకౌముది :**

ప్రభూ! అన్ని విధములా మేము నీవారమయ్యా! మాకు నీకంటే అధికులు మరెవ్వరూ లేరు. నీకు సేవలు చేసెదము. మమ్ము అనుగ్రహించవయ్యా!

మేము యేచిన్న మంచి చేసినా అది చెల్లుబడేటట్లు చేస్తావు. ఇందులో మా నేర్పులేమున్నవి? రాజుయే సామాన్య స్త్రీని వలచినా అది దేవులు (పట్టపురాణి) అవుతుంది కదా! నేను నీ సొమ్మునవటం వల్ల రాసికెక్కితిని (ప్రసిద్ధి చెందాను). నన్ను రక్షించుకోవటం నీ బాధ్యతే.

నీవు పంతముబడితే దానికి తిరుగుంటుందా? ఇంకా మా గుణదోషాలనెందుకు పట్టించుకొంటావు. పరుసవేదితో దేన్ని తాకితే అదియెంత విలువలేని లోహమైనా మేలిమి బంగారం అయిపోదా? పెట్టనిచోట్ల బెట్టి (నావంటి అల్పుని కూడా స్పృశించి) పెద్దసెయ్యవయ్యా! (ధన్యుని చేయుము తండ్రీ!).

నీ కూటమితో మమ్ము అధికులను చేస్తావు. అంతేకాని ఇందులో మా ఆసోదాలేమున్నవి (ఆశతో మేము సాధించేదేమున్నది?) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు యేలినవానినే నీ బంటు (దాసుడు) అంటారు. మాదేమున్నది? మేము కేవలం భక్తితో నిన్ను కీర్తించేవాళ్ళం. మమ్ము స్వీకరించు తండ్రీ!



**సంఖ్య : 148** **సంపుటము : 24** **పుట : 99** **రాగం : ముఖారి**

పల్లవి: పాయపు రమణుఁడ నీ పంత మింకన నెట్లనో
ఆయములే విపరీత మాయఁబో నేఁడు

చ. 1: వుపమించఁ జందురుఁడు వుదయమైతే భూమి
తపిఇంచి చీఁకట్లు తలఁగుఁ గాని
కపురు నా తురుము చీఁకటి నీమోము శశి
వుపరి సురతమున నోడించె నేఁడు

చ. 2: అలరి కొండల మీఁద నంబరపు మేఘములు
గాలికి వాలి నిండాఁ గప్పుఁ గాని
నీల మేఘము వంటి నీపై నా కుచగిరు-
లోలి నుపరతి యందు నొగి వాలె నేఁడు

చ. 3: తేరి మీఁద మదనుఁడు తెలివొందుఁ గాని యందు
నేరుపు శ్రీవేంకటేశ నీ నాయందు
బీరపు మరుని మీఁద పిరిఁది తేరు వారె
ఆరి తేరి రతి వింతలాయఁబో నేఁడు

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో ఉపరతిపై ఇచ్చ బొందిన వేంకటరమణునితో స్వామి విపరీతధోరణి వలన యేమేమి విపరీతాలు జరిగాయో వివరిస్తున్నారు. తినబోతూ రుచి అడుగరాదంటారు పెద్దలు. ఈ కీర్తనలోని మాధుర్యం భావకౌముదిలో ఆనందించడి. ఇక్కడే అంతా వివరిస్తే యెట్లాగు?

**భావకౌముది :**

తరుణ వయస్సులో నున్న రమణుడా! నీ పంతమెట్లున్నదో చూడు. నేడు నీ మర్మగర్భమైన కోర్కెలు విపరీతముగా నున్నవి పోవయ్యా!

ఈ భువిలో చంద్రోదయ మవగానే తపింపజేయు కారుచీకట్లు తొలగిపోతాయి. కాని నేడు నా తురుము (సిగ) యొక్క చీకట్లు నీ వదన చంద్రుని కప్పివేసి వోడిపోవునట్లు చేశాయి. ఇది నీవు కోరిన ఉపరిసురతము చేసిన లీల.

అతిశయించిన కొండలపై ఆకాశంలోని నల్లని మేఘాలు గాలివలన వచ్చి కప్పివేస్తాయి, సహజమే. కాని నేడు నీలమేఘము వంటి నీపై నాచనుకొండలు వాలి నిన్ను ఉపరతి అనే ఓలి (సుంకము) వొసగునట్లు చేసినది.

నేను తేరి (రథము)పై వచ్చు మన్మథుడు తెలివొందుదును (యెఱుగుదును). కాని శ్రీవేంకటేశుడు నాయందు నేర్పు నేడెట్లు చూపుతున్నాడంటే, వీరుడైన మన్మథుడు (స్వామివారు) పిరుదుల రథంపై వస్తున్నాడు. ఆరితేరిన రతిలో వింతలు వెలుగొంద చేసేను కదా! స్వామి రసికత నేమని పొగడుమే?

**సంఖ్య : 122** **సంపుటము : 2** **పుట : 82** **రాగం : భైరవి**

పల్లవి: మనసురానిది యాల మానఁగరాదా
చనవిచ్చి నాకు వేరేసతులఁ దేవలెనా

చ. 1: పొమ్మనఁగరాదా పోయేము మాయింటికి
దిమ్ములమాటల వాదుదియ్యవలెనా
వుమ్మడి నుండనీరాదా వుండేము మాయింటిలోనే
కమ్మటిని వచ్చివచ్చి కాఁకరేఁచవలెనా

చ. 2: మోనాన నుండనీరాదా మొక్కేము నీకాళ్ళకు
నానఁబెట్టి వలపులు నగవలెనా
నే నొల్లననరాదా నిన్నే మీ ననరాను
ఆనవెట్టించుక నన్ను నణఁకించవలెనా

చ. 3: చేసన్న చేయరాదా చేరి అప్పుడే కలతు
యీసురేఁచి యింతవడి నేఁపవలెనా
వాసికి శ్రీవేంకటేశ వద్దనక కూడితివి
యీసరి నితరకాంత లిఁకమీఁద వలెనా

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో ఆయన అన్నమ్మ. స్వామి రహస్యప్రియురాలు. స్వామిని యెదిరించి ప్రశ్నిస్తున్నది. నాపై మనస్సు లేకపోతే రాకుండా మానేయలేకపోయావా? నాకు మరికొొందరు సవతులు అవసరమా? నాకు సైగ చేస్తే రాకపోదును కదా?–ఇంతా చేసి స్వామి కూటమి వదలలేదు అన్నమ్మ.

**భావకౌముది :**

మనసురానిదే యేలనాతో కూటమి? మనగరాదా? నాకు నీ అంతట నీవే చనువు నిచ్చి వేరే కాంతలను కూడా తెచ్చుకోవటం యేమన్నా బాగున్నదా?

మమ్మల్ని పొమ్మనరాదా? మా ఇంటికి పోతాం కదా? అసంబద్ధమైన మాటలతో వాదము పెట్టుకోవటం న్యాయమా? ఏకాంతంగా వుండేటట్లైతే మా ఇంటిలోనే వుంటాము కదా! చక్కగా నా దగ్గరకు వచ్చి వచ్చీ నన్నురెచ్చ గొట్టవలెనా?

స్వామీ! నీ కాళ్ళకు మొక్కెదనుగాని నన్ను కాస్త మౌనంగా వుండనీయరాదా? వలపులను బాగా నాకబెట్టి నవ్వుట నీకు తగునా? నీ కిష్టం లేదనరాదా? నిన్నేమి అనగలము? నీపై ఆన పెట్టుకొని నన్ను అణగించాలని చూడటం నీకు భావ్యమా?

స్వామీ! నాకు చేతితో సైగ చేయక పోయావా? అప్పుడే నిన్ను వచ్చి కలిసే దానిని కదా? నాలో అసూయ రేపి ఇఞత సేపు నన్ను బాధించవలెనా? నీ గొప్ప కోసం నన్ను కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! వద్దనక నన్ను కూడితివి. నీకింకా ఇతర కాంతలతో యేమి పని?



**సంఖ్య : 174** **సంపుటము : 8** **పుట : 102** **రాగం : మాళవశ్రీ**

పల్లవి: మఱియేఁటి సుద్దులు మమ్మేమడిగేవు నీవు
మెఱసి మీయిక్కువలు మించెను దోమట్టై

చ. 1: యింతిని నీవు చూచితే నింగితాకారమెరిఁగి
చింతతోడఁ దలవంచి సిగ్గుపడెను
వింతగానందుకు నీవు వెడనవ్వు నవ్వితివి
పొంతనే కమ్మర నాకె బొమ్మల జంకించెను

చ. 2: పడఁతిని దగ్గరితే భావమెల్లాఁ దెలుసుక
చిడుముడి తమకానఁ జెమరించెను
బడినే అందుకుఁ బూవుబంతి నీవు వేసితివి
వొడిఁ బెట్టుకొని యాకె వుద్దండాన మొక్కెను

చ. 3: అంగనఁ గాఁగిలించితే ఆయములట్టే కరఁగె
సంగతిగాఁ బవలించె శయ్యమీఁదను
అంగవించి శ్రీవెంకటాధిప నీవు గూడితివి
వుంగరములాకెవేళ (ళ్ళ?) నొగి మార్పులాడెను

**మున్నుడి :**

అన్నమయ్య వినిపించిన ఈ శృంగార కీర్తనలో స్వామి దేవిని అనునయముగా దగ్గరకు తీసికొని నవవధువుకుండే సిగ్గు తెఱలను తొలగించి తన శయ్యజేర్చి పరవశింపజేయుట, ఇతివృత్తము. తన పతి చివరికి తన వ్రేలికి ఉంగరం తొడగటంతో ఆమె జగదేకపతి దేవేరియైనది.

**భావకౌముది :**

ఇంకా మరేమి కతలు వున్నాయి స్వామీ! మమ్మేల అడిగేవయ్యా? మీ జాడలు కపటములుగా మాకు తోచుచున్నవి.

నీవు ఈ ఇంతిని చూడు. లోకజ్ఞానము సాకారమైనట్లు వున్నది కదా! అయినా యేదో చింతతో తలవంచి సిగ్గుపడుతున్నది. వింతయేమిటంటే నీవామె సిగ్గుజూచి తెగ నవ్వుతున్నావు. వెంటనే ఆమె తన భ్రుకుటిని ముడిచి నిన్ను బెదిరించుచున్నది.

నీవీ పడతిని దగ్గరకు తీసికొనగానే, నీ భావమును బాగా తెలుసుకొని తత్తరజెందు తమకమున ఆమె చెమటలతో ముద్ద అయిపోతుంది. బడినె (వెంటనే) ఒక పూబంతిని ఆమెపై చిలిపిగా వేసితివి. దానినామె ఒడిలో దాచికొని నీ సాహసము చాలించమని నీకు మొక్కినది.

ఆ అంగనను నీవు కౌగలించగనే ఆమె మేను కరగి పోయింది. నిన్ను చేరి పాన్పుపై నీ పక్కనే పవ్వళించి నీకు ముదము గూర్చినది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అంగవించి (చేరువయ్యై) ఆమెను గూడితివి. పిదప ఆమె వ్రేలికి నీ ఉంగరము తొడిగితివి. ధన్యులము ప్రభూ!

**సంఖ్య : 99** **సంపుటము : 20** **పుట : 67** **రాగం : బౌళి**

పల్లవి: వలచినపతి వాఁడే వచ్చినదాన నే నిదె
తలఁపులుఁ దలపులు తారుకాణ లెన్నఁడే

చ. 1: పుచ్చఁబుచ్చఁ బున్నమలు పొలఁతి నీనవ్వులు
యిచ్చుట నీపతిఁ జూచే దిఁక నెన్నఁడే
నిచ్చ నిచ్చఁ గొత్తలాయ నెలఁత నీజవ్వనము
మెచ్చి మెచ్చి ఆతనితో మేలమాడు టెన్నఁడే

చ. 2: వండవండ నట్లాయ వాడిక నీవలపు
నిండినపతి కాఁగిట నించు టెన్నఁడే
వుండ నుండ నొగరాయ వువిద నీజంకెనలు
అండ నాతనికి వినయాలు సేయు టెన్నఁడే

చ. 3: తినఁదినఁ దీపులాయ తెరవ నీమోవిజున్ను
పొనిఁగి శ్రీవేంకటేశుపొందు లెన్నఁడే
ననిచి యాతఁడే నేఁడు నయముల నిన్నుఁ గూడె
మనికి మీలోలోన మందలించు టెన్నఁడే

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో అయన దేవి చెలికత్తె. ఆమెను ఆ చెలి హెచ్చరిస్తోంది. మీ వెన్నెల నవ్వులు, బాగా పండిన వలపులు బాగానే వున్నాయి. కాని ఇవ్వన్నీ పెండ్లి పీటల మీదకు దారి తీసేదెన్నడు? మీ రిద్దరూ ఒరినొకరు హెచ్చరించుకొని మమ్మల్ని దూరంగా వుంచేదెన్నడు?

**భావకౌముది :**

దేవీ! అదిగో వలచిన పతి వాడే. మిమ్మల్ని కలుపుట కొరకు వచ్చిన దానను నేనే. నీ తలపులు అతని తలపులు, యెన్నడే తారుకాణలగుట (పెళ్ళి ప్రమాణములగుట)?

ఓ పొలతీ (దేవి) విరబూచిన పున్నమి వెన్నెలలు నీ లేతనవ్వులు. కాని నవ్వులటుంచి నీ పతిని జూచుటెన్నడే. ఓ నెలతా! అనునిత్యమూ నీ జవ్వనము నూతనముగా నున్నది. అతనితో మెచ్చికోలు పరాచికములాడుట యెన్నడే?

ఓ ఉవిదా! అలవాటైన నీ వలపులు బాగా పండిపోయి ఈ విధంగా అయినవి. నీ పతి నిన్ను నిండిపోవునట్లు కౌగిలిలో బిగించుటెన్నడే? నీవు అంతగా చేయు జంకెనలు (బెదరింపులు) వొగరైపోతున్నాయి. అతని సరసనజేరి వినయము జూపుట యెన్నడు నేర్చెదవే?

ఓ తెరవా! (ఇంతీ) దినదినమూ నీ అధరపుప మధురిమ జున్ను మాధుర్యం వలె అతిశయించుచున్నది. నీకు శ్రీవేంకటేశ్వరుని పొందులెన్నడే? ఆతడే నేనడు నయముతో నిన్ను కూడినాడు. మీకు లోలోనే ఒకరినొకరు హెచ్చరించుకొనుట యెన్నడే?



రచయిత

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు |
| పుట్టింది | : | 9-6-1945 |
| చదివింది | : | ఎం. టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5, ప్లాటు నెం. 61, సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్దార్థనగర్, |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | +91 9393021360 |
| చదవండి | : | www.geetadeeksha.com |
| ఇవ్వండి | : | e-mail : www.geetadeeksha@gmail.com |